
వార్త
ఆదివారం
16 ఏప్రిల్, 2023
టెన్త్ దాటితే..
బంగారు బాటలు



# బాలీవుడ్‌లోకి ఎన్టీఆర్ ఎంట్రీ!

**'ఆర్ఆర్ఆర్'** సినిమాతో టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ భారత్‌తో పాటు వరల్డ్ వైడ్ ఫాలోయింగ్ సంపాదించుకున్నారు. ఆర్ఆర్ఆర్ విడుదలైన ఏడాది తర్వాత ఈ మధ్యే తన తరువాతి సినిమాను మొదలు పెట్టారు. కొరటాల శివ దర్శకత్వంలో 'ఎన్టీఆర్ 30' సినిమా ప్రారంభమైంది. జాన్వీకపూర్ ఈ చిత్రంతో హీరోయిన్‌గా టాలీవుడ్‌కు పరిచయమవుతోంది. ఇప్పుడు ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ ఖాయమైనట్లు తెలుస్తోంది. బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్‌తో కలిసి యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఓ సినిమా చేయనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్ రాజ్ ఫిల్మ్స్ నుంచి 2019లో హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా తెరకెక్కిన 'వార్' చిత్రానికి సీక్వెల్‌గా ఇప్పుడు 'వార్ 2'ని ప్రకటించారు. ఈ సీక్వెల్‌లో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ చేయనున్నట్లు సమాచారం.

'వార్' మొదటి భాగాన్ని సిద్ధార్థ్ ఆనంద్ రూపొందించగా, 'వార్ 2' చిత్రానికి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించబోతున్నారు. అయాన్ ముఖర్జీ ఈ మధ్యే 'బ్రహ్మాస్త్ర' చిత్రంతో దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు.

---

# వెంకీ జోడీగా శ్రద్ధ శ్రీనాథ్?

**కు**టుంబ హీరోగా తెలుగు తెరపై చెరగని ముద్ర వేసిన విక్టరీ వెంకటేశ్ తన అన్నకొడుకు రానాతో చేసిన 'రానా నాయుడు' వెబ్ సిరీస్‌లో బోల్డ్ క్యారెక్టర్‌లో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రస్తుతం వెంకీ చేతిలో రెండు సినిమాలున్నాయి. అందులో హిందీలో సల్మాన్ ఖాన్‌తో కలిసి 'కిసికా జాన్ కిసికా భాయ్' కాగా, మరోటి 'సైంధవ్'. హిట్ సినిమా ఫేమ్ శైలేష్ కొలను ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. గతానికి భిన్నంగా ఈ చిత్రంగా వెంకీ భారీ యాక్షన్ సీన్స్‌లో కనిపించబోతున్నారు.

ఈ సినిమాలో వెంకీ సరసన ఇద్దరు హీరోయిన్‌లు నటించబోతున్నట్లు తెలుస్తుంది. అందులో సెకండ్ హీరోయిన్‌గా రుహాని శర్మను ఖరారు చేసినట్టు సమాచారం. ప్రధాన హీరోయిన్‌గా జెర్సీ ఫేం శ్రద్ధ శ్రీనాథ్‌ను పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. డైరెక్టర్ శైలేష్ ఇప్పటికే ఆమెకు కథ చెప్పారని, తను కూడా పాజిటివ్‌గా స్పందించినట్లు సమాచారం. కృష్ణ అండ్ హిజ్ లీల సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ కన్నడ బ్యూటీ 'జెర్సీ'తో మంచి విజయం అందుకుంది. ఇప్పుడు వెంకీ సరసన నటిస్తే టాలీవుడ్‌లో ఈ భామకు మరింత గుర్తింపు లభిస్తుందని చెప్పవచ్చు.



ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
16 ఏప్రిల్, 2023

## మంచి ముత్యాలు

స్నేహితులతో మోసగింపబడడం కన్నా,
వారిని విశ్వసించకపోవడం మరింత సిగ్గుచేటు.

- రోష్ ఫోకాల్డ్

## విషయ విశేషం

చికిత్సకు వచ్చేవారికి ఉచిత... 4

'సంఘీ'భావం.....5

సెల్‌ఫోన్లతో వ్యక్తిగత గోప్యత శూన్యం

కవర్ స్టోరీ..6

టెన్త్ దాటితే..

బంగారు బాటలు

ఈవారం కవిత్వం..12

వెన్నెల పూతరేకు

ఆరోగ్యసిరి ఖర్జూరపండు ......18

కథ.. 20

పెళ్లిసందడి

సాహిత్యం...23

పల్లె తెలంగాణ నోట రక్తాశ్రువుల 'పాట'

అతి శీతల ఖండం..అంటార్కిటికా ...25

వైకుంఠనాథుడు రథంపై......30

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

జోక్స్ కార్నర్

వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### గోవులకు గోరింటాకు

కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక సందర్భాల్లో ఆవులపైన రంగులు చల్లడం, కొమ్ములకు పెయింట్లు వేయడం తెలిసిందే. కొందరైతే వాటి నుదురు, వెన్నుపైన చిన్న గోరింటాకు ముద్ద పెడుతుంటారు. అయితే వాటి శరీరం పైన మెహిందీ డిజైను పెట్టడం ఎక్కడైనా చూశారా..పోనీ ఎప్పుడైనా విన్నారా..రాజస్థాన్‌లోని నాథ్‌ద్వారా ప్రాంతంలో వ్రజ్ సామాజిక వర్గం గోవులపై ఆధారపడి జీవిస్తుంటుంది. వారంతా వాటిని కుటుంబ సభ్యుల్లా చూసుకుంటారు. ప్రత్యేక సందర్భాల్లో ఆవులకు మెహిందీ డిజైన్లు వేయడం వారి ఆనవాయితీ. ఇది దాదాపు 350 ఏళ్లుగా అక్కడ కొనసాగుతోంది. పశువులకు మెహిందీ డిజైన్లు పెట్టేటప్పుడు బంధుమిత్రుల్ని పిలుచుకుంటారు. పాటలు పాడుతూ శబ్దాలు చేస్తుంటారు. కృష్ణుడు, చేతి ముద్రలు, పిల్లల రూపాలు, పూలు వంటి ఎన్నో డిజైన్లతో వాటిని అలంకరిస్తుంటారు. ఈ విషయంలో ఆడవాళ్లతోపాటు మగవారూ పోటీపడుతుంటారు. దీపావళి సమయంలో అయితే పదిహేను రోజుల ముందు నుంచే గోమాతలను గోరింటాకుతో అలంకరిస్తుంటారు. ఇవి కూడా కదలకుండా పెట్టించుకోవడం విశేషం.

### శబ్ద కాలుష్యంతో..

రోడ్లమీద ప్రయాణించే వాహనాల శబ్ద కాలుష్యానికి సమీపంలో నివసించే వాళ్లకి బీపీ వచ్చే ప్రమాదం ఎక్కువని అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ నిపుణులు పేర్కొంటున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే రోడ్లమీద నుంచి నిరంతరాయంగా హారన్లూ ఇంజిన్లూ సైరన్ల మోతలు ఎక్కువగా వస్తుంటాయి. వీటివల్ల బీపీ పెరుగుతుంటుందట. ఈ విషయం గత పరిశోధనల్లోనే తేలినప్పటికీ అందుకు కారణం శబ్దమా లేక వాయు కాలుష్యమా అన్నదాన్ని ఖచ్చితంగా గుర్తించలేకపోయారట. తాజాగా చేసిన పరిశీలనలో ట్రాఫిక్ శబ్దాలకు గురవడం వల్ల బీపీ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని తేలింది. ఈ విషయమై బీపీ సమస్యలు లేని 40-69 ఏళ్ల వయసున్న రెండున్నర లక్షల మందిని ఎంపిక చేసి వాళ్ల నివసించే ప్రదేశాల వివరాలను సేకరించారట. ఆయా ప్రదేశాల్లో వచ్చే శబ్దకాలుష్యంతోపాటు గాల్లోని నైట్రోజన్-డై-ఆక్సైడ్ల శాతాన్నీ లెక్కించారు. అందులో వాయు, శబ్ద కాలుష్యాలు రెండింటి బారిన పడ్డవాళ్లలో బీపీ సమస్య ఉన్నట్లు గుర్తించారు. శబ్ద కాలుష్యం ఉన్నవాళ్లలోనూ బీపీ ఎక్కువగా కనిపించింది.

# చికిత్సకు వచ్చేవారికి ఉచిత సదుపాయాలు



మహికి రెండేళ్లుంటాయి. ఆమెకు కేన్సర్. ఆ పాపను పెద్ద ఆసుపత్రిలో చూపించమని డాక్టర్ చెప్పడంతో సిటీకి వచ్చిందా కుటుంబం. ఆసుపత్రిలో పాపకు తోడుగా తల్లి ఉంటే..తండ్రి ఫుట్‌పాత్ మీద పడుకునేవాడు. చిరుద్యోగి అయిన విజయ్ పరిస్థితి ఇదే. తన ఆరేళ్ల పిల్లాడికి కేన్సర్ చికిత్సను చేయిస్తూ నెలల తరబడి నగరంలో ఉండడంతో చివరకు ఉద్యోగాన్నే కోల్పోయాడు. వీళ్లు మాత్రమే కాదు.. పల్లెటూళ్ల నుంచి నగరాలకు కేన్సర్ చికిత్సకోసం వచ్చే పేదల పరిస్థితి ఇంచుమించు ఇలానే ఉంటుంది. నిజానికి కేన్సర్ బారినపడిన చిన్నారులకు ఉచితంగా లేదా తక్కువ ఫీజును తీసుకుని చికిత్స చేసే ఆసుపత్రులు ఉంటాయి కానీ ఆ పిల్లల తల్లిదండ్రులు హోటల్‌లో ఉండాలంటే బోలెడు ఖర్చు. అలాంటివాళ్లకు మేమున్నాం అంటూ చేయూతనిస్తోంది. 'సెయింట్ జ్యూడ్ ఇండియా ఛైల్డ్‌కేర్ సెంటర్'. ఆ చిన్నారుల చికిత్స పూర్తయ్యేవరకూ అన్ని విధాలుగా ఆదుకునే ఈ సంస్థను ముంబయికి చెందిన నిహాల్, శ్యామ కవిరత్నే దంపతులు పదిహేడు సంవత్సరాల క్రితం ప్రారంభించారు. యునిలీవర్ సంస్థలో కీలకహోదాలో పనిచేసిన నిహాల్ ఒసారి ముంబయిలోని టాటా మెమొరియల్ ఆసుపత్రి బయట ఎంతోమంది పేదవాళ్లు పడుకోవడం చూశారు. ఆరాతీస్తే వాళ్లంతా కేన్సర్ బారిన పడిన పిల్లల తల్లిదండ్రులనీ, బాధితులు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటుంటే పెద్దవాళ్లు ఆసుపత్రి బయటే రోజుల తరబడి ఉంటున్నారని తెలిసిందట. దాంతో తన తల్లి జ్ఞాపకార్థకంగా ఈ సంస్థను ముంబయిలో ప్రారంభించిన నిహాల్ క్రమంగా దేశవ్యాప్తంగా పలు నగరాలకు విస్తరింపచేశారు.



### ఈ సదుపాయాలుంటాయి

సాధారణంగా చికిత్సకోసం ఊరుగాని ఊరు వచ్చేవాళ్లకు ఉండటానికి ఓ చోటు, వేళకు మంచి భోజనం, పిల్లలకు కేన్సర్‌కు సంబంధించిన కౌన్సెలింగ్ వంటి సదుపాయాలన్నీ కల్పిస్తుంది సంస్థ. రోగి ఆసుపత్రికి వెళ్లి వచ్చేందుకు వాహనసదుపాయం ఉంటుంది. సిబ్బంది వారానికోసారి నిత్యావసరాలు, పాలు, నెయ్యి, కూరగాయలు..వంటింటి సామాగ్రి, స్టవ్ లాంటివన్నీ ఇస్తారు. నిద్రపోయేందుకు, విశ్రాంతి తీసుకునేందుకు ఎవరిగదులు వాళ్లకు ఉన్నా..వంట, భోజనం చేసేందుకు మాత్రం కామన్ వంటిల్లు, భోజనశాల ఉంటాయి. ఇక, చికిత్స లేని రోజుల్లో మహిళలకోసం టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తే...మగవాళ్లకు సెల్‌ఫోన్ రిపేరింగ్ నేర్పిస్తారు. పిల్లలకూ చదువు చెప్పేందుకు ఓ టీచర్ వస్తారు. అంతేకాదు వాళ్లకు పెయింటింగ్, బొమ్మల తయారీలోనూ శిక్షణ ఇస్తారు. అన్నింటికీ మించి..కేన్సర్‌పైనా, ఆ చికిత్సపైనా చిన్నారులకు, తల్లిదండ్రులకూ వచ్చే ప్రతి సందేహాన్నీ ఓపిగ్గా..ధైర్యాన్ని పెంచుతారు.

### ఎంతకాలం ఉండొచ్చంటే

కేన్సర్ చికిత్స ఎంతకాలం పడుతుందనేది తెలియదు కాబట్టి పూర్తిగా నయమయ్యేవరకూ ఇక్కడే ఉండొచ్చు. ప్రస్తుతం ముంబయితోపాటూ ఢిల్లీ, హైదరాబాద్, వారణాసి, జయపుర, చెన్నైతో కలిపి దేశవ్యాప్తంగా ముప్పై ఎనిమిది కేంద్రాలను నిర్వహిస్తోంది సంస్థ. ఒక్కో కేంద్రంలో పన్నెండు నుంచి పదహారు కుటుంబాల వరకూ ఆశ్రయాన్ని కల్పించే ఈ సంస్థలో సిబ్బంది అంతే అంకితభావంతో పనిచేస్తారు. రోగుల తల్లిదండ్రులతో మాట్లాడటం, అర్హులకే వసతిని కల్పించడం, ఆ పిల్లలు ఆనందంగా ఉండేందుకు తోడ్పడటం, ఇలా ప్రతి దశలో తమ సిబ్బంది పాత్ర కీలకమని అంటారు సంస్థ నిర్వాహకులు. ఈ సంస్థ ఎన్నో అవార్డులను సొంతం చేసుకోవడం విశేషం. ❑



# 'సంఘీ' భావం



# సెల్‌ఫోన్లతో వ్యక్తిగత గోప్యత శూన్యం

మన జీవన విధానంలో మమేకం అయిన సెల్‌ఫోన్‌తో ఉపయోగాలు ఎన్ని ఉన్నాయో కాని నష్టాలు మాత్రం అంతకు మించి ఉంటున్నాయి. ముఖ్యంగా వ్యక్తిగత గోప్యతకు అవకాశం లేకుండా పోతోంది. గతంలో ల్యాండ్‌లైన్ ఫోన్లు కేవలం ఒకరు మరొకరితో మాట్లాడేందుకు మాత్రమే ఉపయోగపడేవి. అంతకు మించి దానిని వేరొక పనికి ఉపయోగించేందుకు అవకాశం ఉండేది కాదు. అయితే ప్రస్తుతం వస్తున్న స్మార్ట్‌ఫోన్లు మనకు అవసరమైనవే కాకుండా మనకు తెలియకుండానే మన విషయాలను ప్రపంచానికి తెలియజేస్తున్నాయి. మనకు ఏ అంశాలు ఇష్టమో, దేని గురించి మనం తరచూ ఫోన్లను ఉపయోగిస్తున్నామో అన్న విషయాలు ఆటోమెటిక్‌గా రికార్డు కావడమే కాదు ఫోన్‌లో అందుబాటులో ఉన్న వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా మనకు తిరిగి చూపిస్తుంటాయి. ఉదాహరణకు ద్విచక్రవాహనం కొనుగోలుకు సంబంధించి ఫోన్‌లో మనం గూగుల్‌లో సెర్చ్ చేస్తే వెంటనే ఆ విషయాన్ని అత్యాధునిక సాఫ్ట్‌వేర్ పసిగడుతుంది. ఫేస్‌బుక్ ఓపెన్ చేసిన వెంటనే వివిధ ద్విచక్రవాహనాలకు సంబంధించిన వివరాల ప్రకటనలు లెక్కకు మించి కనబడతాయి. అదేవిధంగా ఇల్లుగాని, స్థలం కాని కొనుగోలు చేయడానికి దానికి సంబంధించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే ఇక ఫేస్‌బుక్ నిండా ఇవే ప్రకటనలు వెల్లువెత్తుతాయి. కొన్ని సందర్భాల్లో ఏదైనా అంశం గురించి ఫోన్‌లో ఇతరులతో మాట్లాడే సమయంలో ఆ అంశానికి సంబంధించిన ప్రకటనలు కూడా కనిపిస్తుంటాయి. దీనిని బట్టి మనం మాట్లాడే ప్రతి మాట రికార్డు అవుతుందన్న విషయాన్ని గ్రహించాలి. ఇక వేరొకరితో సంభాషించినప్పుడు అటువైపు ఉన్న వ్యక్తి ఆ మాటలు రికార్డు చేస్తుంటారు. ఏదైనా పొరపాటుగానో, ఉద్దేశ్యపూర్వకంగానో మన మనోభావాలు బయటపెడితే సదరు వ్యక్తి వాటిని వివిధ సామాజిక మాధ్యమాలలో పోస్టింగ్‌లు చేయడం గాని, లేదంటే మనం ఎవరి గురించి విషయాలు బయట పెట్టామో ఆ వ్యక్తికి చేరవేసే అవకాశం ఉంది. దీనివల్ల ఆయా వ్యక్తులతో శత్రుత్వం పెరిగే అవకాశం ఉంటుంది. పైగా మరికొందరు మనం మాట్లాడిన దానిని ఎడిట్ చేసి ఎదుటి వారి కోసం ప్రస్తావించిన అంశాన్నే పోస్ట్ చేయడం వల్ల మనం తప్పు మాట్లాడినట్లు అవుతుంది. ఈ అంశాలకు తోడు జిపీఎస్ మన కదలికలను ఎప్పటికప్పుడు రికార్డు చేస్తుంది. ఏ క్షణంలో ఎక్కడ ఉన్నాము, ఎంతసేపు గడిపాము అన్న వివరాలు రికార్డు చేస్తూ ఉంటుంది. దీనివల్ల మనం ఎవరితోనైనా రహస్యంగా కలిసినా, ఏదైనా ప్రాంతానికి వెళ్లినా ఆ విషయం రికార్డు అవుతుంది. మనం ఏదైనా రెస్టారెంట్‌కు వెళితే కొన్ని నిమిషాల్లో ఆ రెస్టారెంట్‌కు మీరు రేటింగ్ ఎంత ఇస్తారు అని గూగుల్ ప్రశ్నిస్తూ నోటిఫికేషన్ పంపిస్తుంది. టూరిజం స్పాట్‌కు వెళితే ఎంతవరకు మీరు ఆ ప్రాంతాన్ని ఆస్వాదించారు. ఎవరికైనా రిఫర్ చేస్తారా అని ప్రశ్నిస్తుంది. దీనిని బట్టి మన ప్రతికదలిక బహిరంగమని స్పష్టం అవుతుంది. మనకు కొన్ని సందేశాలు ఎస్ఎంఎస్, వాట్సప్, ఫేస్‌బుక్ వంటి అనేక మార్గాల ద్వారా వస్తుంటాయి. మనకు ఆసక్తిగా ఉండే అంశం ఉండటంతో దానిని ఓపెన్ చేసి చదువుతాం. వెంటనే మనకు సదరు సంస్థ నుంచి ఫోన్ వస్తుంది. ఆ సంస్థ ప్రొడక్ట్‌ను గాని, స్థలం, ఫ్లాట్ కొనుగోలు విషయంపై మాట్లాడేందుకు ప్రయత్నిస్తారు. ఇటీవల హైదరాబాద్‌లో సైబర్ క్రైం పోలీసులు భారీ డేటా చోర్యం అంశాన్ని వెలికి తీసారు. కోట్లాది మంది వివరాలను సదరు సంస్థ ప్రతినిధులు సేకరించి వేరొకరికి విక్రయించారు. మన వ్యక్తిగత సమాచారాన్ని మనకు సంబంధం లేకుండా ఎవరో విక్రయించేస్తున్నారు. అలాంటి దుర్భరపరిస్థితుల్లోకి ఈ సెల్‌ఫోన్‌లు నెట్టివేస్తున్నాయి. గూగుల్ మ్యాప్‌లో సెర్చ్ చేస్తే మన తెల్లవారు జామున నుండి ఎక్కడెక్కడ తిరిగాం అన్నది క్షణాలతో సహా మనకు చూపిస్తుంది. ఎదుటి వారు కొంత టెక్నాలజీని ఉపయోగిస్తే మనం వివరాలు సేకరించడం పెద్ద కష్టం కాదు. ప్రస్తుతం ఇదే పనిని పోలీసులు తమ దర్యాప్తులో అధికారికంగా వాడుకుంటున్నారు. ఇటీవల కడప జిల్లాలో వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో సిబిఐ ఈ వివరాలను రాబట్టగలిగింది. వివేకా హత్య జరిగినప్పుడు ఆ ప్రాంతంలో ఎవరెవరు ఉన్నారన్న వివరాలు టెక్నాలజీని ఉపయోగించి పసిగట్టింది. అలాగే ఒక నేరస్తుడు ఎటువైపు పయనిస్తున్నాడు అన్న వివరాలు సెల్ టవర్ సిగ్నల్స్ ద్వారా కనిపెడుతున్నారు. ఎల్‌బీనగర్ ప్రాంతంలో ఒక సిఐ మహిళపై కన్నేశాడు. వివాహేతర సంబంధాన్ని ఆమెను లొంగదీసుకుని కొనసాగిస్తున్నాడు. ఆమె భర్త నగరాన్ని విడిచి వెళ్లిన వెంటనే ఆమె ఇంటి ముందు సదరు సిఐ ప్రత్యక్ష అవుతున్నాడు. తన భర్త లేని విషయం ఎలా తెలుస్తోందని ఆలోచిస్తే భర్త సెల్‌ఫోన్ సిగ్నల్స్ పసిగడుతున్నట్లు తేలింది. దీనితో భర్త తన సెల్‌ఫోన్ ను విజయవాడకు పంపించి అతను ఇక్కడే మాటు వేసి ఉన్నాడు. ఎప్పటిలా ఇంటి ముందు ప్రత్యక్షమైన సిఐని పోలీసు అధికారుల సహాయంతో పట్టుకోగలిగాడు. ఇలాంటి సమస్యలు ఎన్నో ఉన్నాయి. నేర పరిశోధనలో ఎంతో సహకరించే సెల్‌ఫోన్లు నేరాలు చేయడానికి కూడా ఉపయోగపడుతున్నాయి. సెల్‌ఫోన్ వాడకం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నప్పటికీ క్రమంగా మన గోప్యతను, వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తున్నాయనడంలో సందేహం లేదు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# టెన్త్ దాటితే.. బంగారు బాటలు

కవర్ స్టోరీ

రుద్రరాజు శ్రీనివాసరాజు

**పదో** తరగతి అనేది ప్రతి విద్యార్థి జీవితంలో ఓ కీలకమైన దశ! ఒకవిధంగా భవిష్యత్తును దిశనిర్దేశం చేసే దశ కూడా ఇదే. ఎందుకంటే పదవ తరగతి తరువాత విద్యార్థులు అకడమిక్ వేసే అడుగులే విద్యార్థి కెరీర్ అవకాశాలను, భవిష్యత్తునూ నిర్ణయిస్తాయి. విద్యార్థులు తమ భవిష్యత్తు దశ దిశ నిర్దేశించుకోవలసిన సమయమిదే. విద్యార్థి జీవితంలో కీలకమైన రాయిగా నిలిచిన ఈ పదవ తరగతి దశ దాటిన పిదప విద్యార్థులు తీసుకునే నిర్ణయం వారి జీవిత గమనాన్ని నిర్ణయిస్తుంది. అందుచేత పదవ రతగతి తరువాత ఉన్నత విద్యకు సంబంధించి విభిన్న కోర్సుల ఎంపిక సమయంలో కెరీర్ విషయంలో ఆచితూచి అడుగులు వేయవల సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే ఒకవేళ ఈ సమ యంలో తప్పటడుగుపడితే జీవితాంతం బాధపడవలసి వస్తుంది. అందుచేత కోర్సు ఎంపికలో ఒకటికి రెండుసార్లు ఆలోచించి విద్యార్థులు అభిరుచులను సామర్థ్యాన్ని అనుసరించి వారి కెరీర్ విషయంలో తెలివైన నిర్ణయం తీసుకోవాలి. కానీ 15 నుండి 16 సంవత్సరాల ఈ వయసులో విద్యార్థులకు భావిప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కోర్స్‌ను ఎంచుకునే సామర్థ్యం ఉంటుందా అంటే సందేహాస్పదమే. అయితే ఈ దశలో కూడా అవగాహనతో తన అభిరుచులు, తన సామర్థ్యాన్ని బేరీజు వేసుకుని ఉన్నత విద్యకు సంబంధించి కోర్సులను ఎంపిక చేసుకునే విద్యార్థులు కూడా లేకపోలేదు. కాకపోతే ఈవిధంగా స్వీయ నిర్ణయం తీసు కునే వాళ్ల సంఖ్య తక్కువే అని చెప్పవచ్చు. ఈ స్థితిలో విద్యార్థు లు కానీ తల్లిదండ్రులు కానీ కోర్సు ఎంపిక విషయంలో సర్వ సాధారణంగా ఆలోచించే విషయాలు ఏమిటంటే, వర్తమానంలో ఏ కోర్సుకు డిమాండ్ ఉంది? ఏ కోర్సు చదివితే ప్రయోజకులు అవుతారు? ఏ కోర్సు చదివితే మెరుగైన ఉద్యోగ అవకాశాలు న్నాయి? ఏ కోర్సు ద్వారా అధిక వేతనాలు పొందే ఉద్యోగం లభిస్తుంది. అందుబాటులో ఉన్న కోర్సులు ఏమిటి? ఏ కోర్సు కష్టంగా ఉంటుంది? ఏ కోర్సు చదివితే జీవితంలో త్వరగా స్థిరపడవచ్చు? దీనికి సంబంధించిన సమాచార సేకరణకై అనేక మందిని సంప్రదిస్తూ ఉంటారు. వారిలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను, ఇప్పటికే కెరీర్‌లో ఉన్నతంగా సెటిల్ అయిన వారిని, వారి తల్లిదండ్రులను ఉపాధ్యాయులను సంప్రదించి వారికి లభించిన సమాచారం, వైవిధ్యంగా ఉండే సలహాలు మొదలైన అన్నింటినీ క్రోడీకరించి ఒక నిర్ణయానికి వస్తారు. అయితే అందరి తల్లితండ్రులు విద్యావంతులై ఉండరు. అప్పుడు ఈ ఎంపిక నిర్ణయాన్ని సహజంగా పిల్లలకే వదిలిపెట్టేస్తారు లేదా పొరుగున ఉన్న విద్యావంతుల సలహా తీసుకుంటారు. పిల్లలు అయితే సాధారణంగా తమ స్నేహితులు ఏ కోర్సు తీసుకుంటున్నారు అనేది గమనిస్తూ ఉంటారు. ఈ సమయంలో ఎవరు సలహా ఇచ్చినా ప్రస్తుతానికి ఏ గ్రూపుకు బాగా డిమాండ్ ఉంది, ఏ గ్రూపుమంచిది ఏ గ్రూపు మధ్యస్థం అంటూ తమ వ్యక్తిగత అభిప్రాయాలను చెబుతారే తప్ప విద్యార్థి సామార్థ్యాన్ని పరిగణనలోనికి తీసుకుని సూచనలు చేసే వారు తక్కువగానే ఉంటారు. ఈ సందర్భంలో పదవతరగతి అనంతరం వివిధ కోర్సుల వివరాలు పూర్తిగా విద్యార్థులకు తెలియడం లేదు. ఫలితంగా కోర్సు ఎంపిక విషయంలో చాలామందిలో సరైన నిర్ణయం కనిపించడం లేదు. చివరకు దోలాయమాన పరిస్థితులలో ఏదో ఒక గ్రూపును ఎంచుకుంటే తర్వాత ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తున్నది. అన్నింటికీ మించి విలువైన కాలం వృథా అవుతుంది. తీసుకున్న కోర్సును మధ్యలోనే వదిలిపెట్టేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇటువంటి పరిస్థితులను అధిగమించి, సరైన నిర్ణయం తీసుకోవాలంటే, విద్యార్థి పదవ తరగతి చదువుతూ ఉన్న సమయంలోనే కొంత పరిజ్ఞానం సంపాదించాలి.

పదవ తరగతిలో అభ్యసించే పాఠ్యాంశాలకు దాని తరువాత అభ్యసించే విద్యావిధానానికి వైవిధ్యం ఉంటుంది. ఎందుకంటే పదవతరగతిలో మూడు లాంగ్వేజీలు సోషల్, మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్ నాచురల్ సైన్స్ విధిగా అందరూ అభ్యసించాలి. ఆ సమయంలోనే విద్యార్థికి తనకు ఏ సబ్జెక్ట్‌పై ఆసక్తి ఎక్కువ ఉంది, ఏ సబ్జెక్ట్‌పై వెనుబడి ఉన్నాను అనేది తెలిసిపోతుంది. అప్పుడు తనకు ఆసక్తిగల సబ్జెక్ట్ ప్రధానంగా కొనసాగే కోర్సులు

ఎంపిక అంటే ముందు తన బలాలు, బలహీనతలను బేరీజు వేసుకుని గ్రూపును ఎంపిక చేసుకోగలగాలి.

**కోర్సును ఎలా ఎంచుకోవాలి?**

తమ భవిష్యత్‌ను ఎలా ఎంచు కోవాలి? తమ భవిష్యత్‌ను దృష్టి లో పెట్టుకుని ఏదయినా కోర్సు ను ఎంపిక చేసుకునే ముందు ప్రతీ విద్యార్థి తన స్వీయ సామర్థ్యా లను ఎంపిక చేసుకోవాలి. సర్వ సాధారణంగా కోర్సు ఎంపికకు ఎంచుకునే మార్గదర్శకాలు ఏమంటే నాకు లెక్కలు అంటే భయం అందుకే బైపీసీ తీసుకోవాలని అనుకుంటున్నాను. నాకు సైన్స్ మ్యాథ్స్ అంటే భయం కనుక సీఈసీ లేదా హెచ్‌ఇసి వంటి ఆర్ట్స్ కోర్సు లు తీసుకుంటాను ఇలా ఉంటాయి విద్యార్థుల ఆలోచనలు. వాస్తవంలో చాలామంది నిర్ణయాలు ఇదేపంథాలో జరుగుతూ ఉంటాయి. ఏదయితే తనకు కష్టంగా తోచిందో దానికి భిన్నంగా తేలికైన సబ్జెక్టును ఎంపిక చేసుకోవడం అనేది సహేతుకం కాదు. మరికొందరు అయితే ఏ మాత్రం ఆలోచన లేకుండా తమ స్నేహితులు ఇరుగు పొరుగు వాళ్లు తీసుకున్న గ్రూపులనే తీసుకుంటారు. దీనివలన తాము తీసుకున్న కోర్సు లో ఎప్పటికీ విజయవంతం కాలేరు. ముందుగా విద్యార్థులు తమకు ఆసక్తి అభిరుచి కలిగిన సబ్జెక్టులు ఏమిటి తమ కుటుంబ పరిస్థితి ఏమిటి అని గుర్తించి అప్పుడు తాను ఎంచుకోబోయే కోర్స్ ఎక్కడ లభిస్తుంది దాని భవిష్యత్ అవకాశాలు ఏమిటి అనేది బేరీజు వేసుకుని నిర్ణయం తీసుకోగలిగితే సత్ఫలితాలు సాధ్యం అవుతాయి.
విద్యార్థులు సరైన నిర్ణయంతో ఏదయినా కోర్స్ నందు ప్రవేశించాలి అంటే విభిన్న కోర్సుల ప్రత్యేకతలు ఉపాధి అవకాశాలు విభిన్న కోర్సుల పూర్తి వివరాలు సమగ్రంగా తెలియాలి. అప్పుడే విద్యార్థులు తీసుకున్న నిర్ణయం మంచి ఫలితాలను ఇస్తుంది. ఈ క్రమంలో ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలో పదవ తరగతి పరీక్షలు పూర్తయి త్వరలోనే ఫలితాలు రానున్నాయి. ఈ నేపథ్యంలో పదోతరగతి తర్వాత అందుబాటులో ఉన్న అకడమిక్ మార్గాలు, భవిష్యత్తు అవకాశాలు, ఆయా కోర్సు లను ఎంచుకోవడానికి ఉండాల్సి న లక్షణాలు తదితర అంశాలను పరిశీలిద్దాం.
సాధారణంగా పదవ తరగతి పూర్తికాగానే కాలేజీ విద్యపైనే అందరి దృష్టి ఉంటుంది. అంటే ఇంటర్మీడియట్ కోర్సు పైనే విద్యార్థులు ఎక్కువ దృష్టిపెడతారు. అయితే ఇంటర్‌లో కూడా అన్ని కోర్సు లపై కాకుండా ఏదో ఒకటో రెండు గ్రూపుల గురించి మాత్రమే పరిజ్ఞానం కలిగి ఉంటారు. మొదటిగా ఇంటర్‌మీడియట్ కోర్సు వివరాలు దాని కాంబినేషన్లు పరిశీలిద్దాం.

**ఇంటర్మీడియట్**

పదవ తరగతి పూర్తి చేసిన వారు సర్వ సాధారణంగా పాఠశాల విద్యకూ, ఉన్నత విద్యకూ మధ్యవారధిలాంటి సాధారణ ఇంటర్మీడియట్ వైపు మొగ్గుచూపుతారు. కారణం ఏమిటంటే ఉన్నత విద్యలోకి ప్రవేశించేందుకు ఉన్నత విద్యారంగానికి ఇంటర్మీడియట్ అనేది ఒక 'గేట్ వే' లాంటిది. అయితే ఉన్నత విద్యకు వారధి లాంటి ఇంటర్మీడియట్‌లో సరైన గ్రూపును ఎంచుకోవడమే అత్యంత కీలకమైన అంశం. ఎందుకంటే ఈ గ్రూపుమీదే మిగిలిన (ఉన్నత) విద్య అంతా ఆధారపడి ఉంటుంది. విద్యార్థి కెరీర్‌ను నిర్దేశించే



కీలకమైన మలుపు కూడా ఈ కోర్సు. అందుచేత ఇక్కడ ఏ గ్రూపులో చేరాలి అనే విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకోవాలి. రెండు తెలుగురాష్ట్రాలలో కూడా ఇంటర్మీడియట్ బోర్డు విభిన్న కాంబినేషన్లలో సుమారు 85 గ్రూపుల వరకు రూపొందిం చింది. అయితే వీటిలో కేవలం 7 లేదా 8 కాంబినేషన్లలోనే అత్యధికులు జాయిన్ అవుతున్నారు. వీటిని సైన్స్ (ఎంపిసీ/ బైపీసీ), కామర్స్ (సీఈసీ/ఎంఈసి), హ్యూమానిటీస్ (హెచ్ఈసీ)..ఇలా మూడు ప్రధాన విభాగాలుగా విభజించవచ్చు.
ప్రధాన గ్రూపులు వాటి కాంబినేషన్లు ఎంపిసీ (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ), బైపీసీ (బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ), సీఈసీ (కామర్స్, ఎకనమిక్స్, సివిక్స్), ఎంఈసీ (మ్యాథ్స్, ఎకనమిక్స్, కామర్స్), హెచ్ఈసీ (హిస్టరీ, ఎకనమిక్స్, సివిక్స్), ఎంపిసీ (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ). మొత్తం ఇంటర్మీడియట్‌లో గల వివిధ గ్రూపులలో అత్యధికులు జాయిన్ అయ్యే గ్రూప్ ఎంపిసీ. ఇంజనీర్‌గా కెరీర్ లో స్థిరపడాలనుకునే వారు ఇంటర్మీడియట్‌లో ఎంపిసి గ్రూపులో చేరవచ్చు.
మ్యాథ్స్ పై ఆసక్తితో పాటు కంప్యూటేషనల్ స్కిల్స్, న్యూమరికల్ స్కిల్స్, పుస్తకాల్లో చదివిన సైన్సు అంశాలను అన్వయించగలిగే నైపుణ్యం, వివిధ సూత్రలను వేగంగా అన్వయించే నైపుణ్యాలు గల విద్యార్థులకు ఈగ్రూప్ సరిపోతుంది. ఇంజనీరింగ్, ఎంసెట్, జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీల్లో ప్రవేశానికి పరీక్ష జేఈఈ మెయిన్, జెఈఈ అడ్వాన్స్‌డ్ తదితర ప్రవేశపరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి బీటెక్ కోర్సు ల్లో అడుగుపెట్టడం, ఈ గ్రూపు ద్వారా, నిట్‌లు, టాప్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇంజనీరింగ్ సీటు సంపాదించాలనే లక్ష్యంగా గల విద్యార్థులకు ఎంపీసీ గ్రూప్‌లో ప్రవేశించాలి. ప్రతిష్ఠాత్మకమైన బిట్స్ పిలానీల్లో ప్రవేశానికి రిగే 'బిట్‌శాట్' రాసేందుకు కూడా ఎంపీసీ విద్యార్థులే అర్హులు. ఒకానొక కాలంలో ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయడంతో ఇంజనీరింగ్ లక్ష్యంగా ఈ గ్రూపులో జాయిన్ అయ్యేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే ఎంపీసీ గ్రూపు తీసుకుని ఇంజినీరింగ్ కెరీర్‌పై ఆలోచన లేనివారు మాత్రం ఎంపీసీ తర్వాత బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో బీఎస్సీ లో అడుగుపెట్టి, తర్వాత ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యను అభ్యసించి పరిశోధనలు దిశగా వృత్తి జీవితాన్ని సుస్థిరం చేసుకోవచ్చు. వీటితో పాటు ఆర్కిటెక్చర్, ఫ్యాషన్ టెక్నాలజీ, సీఏ/సీఎస్/సీఎంఏ తదితర ప్రొఫెషనల్ కోర్సు లు, డైరీ టెక్నాలజీ, లా, డిజైన్ కోర్సు లు, బీఎస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ, ఇలా అనేక ఉన్నత విద్యావకాశాలకు ఎంపీసీ గ్రూప్ అర్హతగా నిలుస్తోంది. ఒకవేళ టీచింగ్ కెరీర్‌పై ఆసక్తి ఉంటే రెండు సంవత్స రాల ఎంపీసీ తరువాత డైట్‌సెట్ ద్వారా డీఈడీ కోర్సు పూర్తి చేసుకుని ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడవచ్చు. మొత్తం మీద ఇంటర్ ఎంపీసీ పూర్తిచేసిన విద్యార్థులు మెడిసిన్ తప్ప..ఏ కోర్సు లోనైనా చేరేందుకు అర్హులని చెప్పొచ్చు. ఈ గ్రూపు ద్వారా

లక్ష్యాలను చేరుకోవాలంటే ఇంటర్‌లో చేరిన నాటి నుంచి లక్ష్యం దిశగా కృషి చేయాలి. బైపీసీ..(బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ) లైఫ్ సైన్సెస్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులకు సరితూగే గ్రూప్ బైపీసీ. వాస్తవానికి బైపీసీ గ్రూప్‌లో చేరే విద్యార్థుల లక్ష్యం..ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో చేరడం. వైద్యులుగా కానీ వైద్యసంబంధమైన వృత్తుల్లో ఉద్యోగాలలో స్థిరపడాలి అనుకునేవాళ్లు ఈ గ్రూపుపై మక్కువ చూపుతారు. బైపీసీ చదివిన వారు నీట్‌లో ఉత్తీర్ణత సాధించి ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశించొచ్చు. అదే విధంగా ఎయిమ్స్ ఎంట్రన్స్, జిప్‌మర్, ఇతర మెడికల్ ప్రవేశపరీక్షల్లో ఉత్తీర్ణత ద్వారా ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులు అభ్యసించవచ్చు. మెడికల్ కోర్సులతో పాటు వెటర్నరీ సైన్స్, అగ్రికల్చర్ సైన్స్, బ్యాచిలర్ ఆఫ్ హోమియోపతి మెడిసిన్ అండ్ సర్జరీ (బీహెచ్‌ఎంఎస్), బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ (బీఏఎంఎస్), బీఫార్మసీ, ఫార్మ్-డీ, నర్సింగ్, ఫిజియోథెరపీ, బయోటెక్నాలజీ, ఫోరెన్సిక్ సైన్స్ తదితర కోర్సుల్లో చేరొచ్చు. ఈ మధ్యకాలంలో ఎక్కువ మంది అగ్రికల్చర్ కోర్సులకు ఆసక్తి చూపడంతో బైపీసీ గ్రూపు తీసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. వైద్య విద్య అభ్యాసనమే ప్రధానంగా ఈ కోర్సు ను ఎంపిక చేసుకునే వారు సాధారణంగా ఆర్థికంగా స్థిరపడిన వారు అయి ఉంటా రు. ఈ గ్రూపు తీసుకుని ఉన్నత విద్య కొనసాగిస్తే బయోటెక్నాలజీ, బయో కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, ఫార్మసీ, జెనెటిక్స్, అగ్రికల్చర్, ఆక్వా కల్చర్, ఆస్ట్రానమీ, బయో ఇన్ఫర్మాటిక్స్, బయో స్టాటిస్టిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫుడ్‌టెక్నాలజీ అండ్ ప్రాసెసింగ్, ఫారెస్ట్ రేంజర్, జియాలజీ, హార్టికల్చర్, హోం సైన్స్, మాలిక్యులార్ బయాలజీ, ఓషనో గ్రఫీ, ప్లాంట్‌పాథాలజీ తదితర రంగాల్లో అవకాశాలుంటాయి. నానో టెక్నాలజీ, బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్ ఈ శతాబ్దపు పరిశోధనారంగాలుగా పేర్కొన వచ్చు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు గమనిస్తే రానున్న యుగం అంతా బయా లజీదే అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ కారణంగానే ఈమధ్యకాలంలో బైపీసీ గ్రూపులో చేరే వారి సంఖ్య క్రమేపీ పెరుగుతూ



వస్తున్నది.

☛ కామర్స్ విభాగం

☛ ఎంఈసీ (మ్యాథ్స్, ఎకనమిక్స్, కామర్స్)

☛ సీఈసీ (కామర్స్, ఎకనమిక్స్, సివిక్స్)

☛ ఎంఈసీ (మ్యాథ్స్, ఎకనమిక్స్, కామర్స్) సైన్స్ సబ్జెక్టు అయిన మ్యాథ్స్, కామర్స్ సబ్జెక్టులైన ఎకనామిక్స్, కామర్స్ కలయికే ఎంఈసీ గ్రూపు. 'మ్యాథ్స్ అంటే మక్కువ కానీ ఫిజిక్స్, కెమిస్ట్రీలంటే భయం' అనుకునేవారు సేవారంగంవైపు చూసేవారు నిశ్చింతగా ఇంటర్లో ఎంఈసీ గ్రూపు తీసుకోవచ్చు. స్థూలంగా సైన్స్, కామర్స్ మేలు కలయికే ఎంఈసీ, సైన్, ఆర్ట్స్ గ్రూపులపై పెద్దగా ఆసక్తి లేనివారు లెక్కలు గణాంకాలు, కామర్స్ సబ్జెక్టులతో కూడిన ఎంఈసీ, కామర్స్, ఎకనమిక్స్, సివిక్స్ సబ్జెక్టులు ఉన్న సీఈసీల్లో చేరవచ్చు. చార్టెర్డ్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రెటరీలు, కమర్షియల్ లాయర్లు, బ్యాంకు మేనేజర్, చార్టెర్డ్ ఫైనాన్షియల్ అనలిస్ట్, ట్యాక్స్ ఆడిటర్‌లాంటి వృత్తుల్లో స్థిరపడాలనుకునేవారు, ఇన్సూరెన్స్ సంస్థల్లో, స్టాక్‌మార్కెట్లలో ఉద్యోగాలు పొందాలనుకునే వారు ఈ గ్రూపులను ఎంచుకోవచ్చు. వ్యాపార వ్యవహారాలు, గణాంకాల విశ్లేషణపై ఆసక్తి ఉన్నవారికి సీఈసీ, ఎంఈసీ రెండు గ్రూపులు ఎంతో అనుకూలం. ప్రస్తుత కార్పొరేట్ యుగంలో వ్యాపార, పారిశ్రామిక రంగం శరవేగంగా విస్తరిస్తోంది. ఈ క్రమంలో కామర్స్‌లో నైపుణ్యాలున్న వారికి రోజురోజుకు అవకా శాలు పెరుగుతూ వస్తున్నాయి. సామాన్య గుమాస్తాల నుంచి దేశ ఆర్థికరంగాన్ని శాసించే ఆర్థిక నిపుణుల వరకూ కామర్స్ రంగంలో ఎన్నో కొత్త అవకాశాలు పుట్టుకొస్తున్నాయి. ప్రధానంగా దేశంలో అకౌంటెంట్ల కొరత ఎక్కువగా ఉన్న నేటి తరుణంలో కామర్స్ అభ్యసించిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని వాణిజ్యనిపుణుల అభిప్రాయపడుతున్నారు. సీఈసీ (కామర్స్, ఎకనమిక్స్, సివిక్స్) గత కాలంలో బ్యాంక్ ఉద్యోగాల పట్ల మక్కువ గలవారు మాత్రమే సీఈసీ గ్రూపును ఎంచుకుంటారు అనే అభిప్రాయం ఉండేది. నేటి ఆధునిక ప్రపంచంలో కామర్స్ అభ్యసించిన వారికి కార్పొరేట్ రంగంలో ఎన్నో కొలువులను అందించే కోర్స్‌గా సీఈసీ నిలిచింది. రెండేళ్ల ఇంటర్మీడియట్‌కోర్సులో భాగంగా ఈసీసీ గ్రూపులో చేరిన విద్యార్థులు కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టులను అభ్యసించాలి. వాస్తవానికి సీఈసీ విద్యార్థులకు ఉన్నత విద్యపరంగా బీకామ్ కోర్సు ముఖ్యమార్గంగా నిలుస్తోంది. బీకామ్ చేస్తూనే చార్టర్డ్ అకౌంటెన్సీ, కాస్ట్ అకౌంటెన్సీ, కంపెనీ సెక్రటరీ వంటి జాబ్‌గ్యారెంటీ కామర్స్ ప్రొఫెషనల్ కోర్సులు అభ్యసించడం ద్వారా ఉజ్వల కెరీర్‌కు మార్గం వేసుకోవచ్చు. కామర్స్ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేయడం ద్వారా కంపెనీల్లో ఇంటర్నల్ ఆడిటర్స్, స్టాక్ ఆడిటర్స్, ఫైనాన్షియల్ మేనేజర్స్, అసిస్టెంట్ కంపెనీ సెక్రటరీస్ వంటి వైట్‌కాలర్ ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. సీఈసీ విద్యార్థులు బీకామ్ డిగ్రీ పూర్తిచేసుకున్నాక పీజీస్థాయిలో ఎంబీఏలో చేరొచ్చు. అలాగే పీజీస్థాయిలో ఎంకామ్‌లోనూ చేరే అవకాశముంది. ఇటీవల కాలంలో జాబ్ మార్కెట్‌కు అనుగుణంగా బీకామ్, ఎంకామ్‌లలోను వివిధ స్పెషలైజేషన్లు అందుబాటులోనికి వచ్చాయి.

కామర్స్ కెరీర్ కావాలి కానీ మ్యాథ్స్ అంటే భయం అనుకునేవారు నిశ్చితంగా ఈ గ్రూపు తీసుకోవచ్చు. సి.ఇ.సి.గ్రూపు తీసుకొని సి.ఎ., సి.ఎం.ఎ., సి.ఎస్. వంటి వృత్తివిద్యాకోర్సులు పూర్తి చేసుకోవచ్చు. పోటీపరీక్షలకు బెస్ట్ హెచ్ఈసీ హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా సాగే కోర్సు హెచ్ఈసీ. సామాజిక అంశాలపై అవగాహన, సమాజంలో ఎప్పటికప్పుడు చోటుచేసుకునే పరిణామాలను అన్వేషించే నైపుణ్యం ఉన్నవారికి సరైన గ్రూప్ హెచ్ఈసీ. సంప్రదాయిక కోర్సుల్లో ప్రముఖంగా చెప్పుకోదగింది హెచ్ఈసీ. అదేసమయంలో నేడు ఎక్కువగా నిరాదరణకు గురవుతోంది కూడా హెచ్ఈసీ గ్రూపు అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. అక్కడక్కడ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఈ గ్రూపు కనిపిస్తున్నా కార్పొరేట్ కళాశాలల్లో మాత్రం మచ్చుకైనా ఈ గ్రూపు కనిపించదు. అయితే ఎంతో ప్రతిష్ఠాత్మక గ్రూపులు అని చెప్పే సైన్స్ కామర్స్ కోర్సులు అభ్యసించిన అత్యధికులు డ్రీమ్ ఏమిటంటే అత్యున్నత హోదా కలిగిన ఐఏఎస్, ఐపిఎస్ ఉద్యోగాలు సాధించడం. దీనికోసం ఎందరో డాక్టర్లు, ఇంజనీర్లు, ఎంబిఏ గ్రాడ్యుయేట్లు కూడా ఈ రోజుల్లో సివిల్స్ వైపు దృష్టి సారిస్తున్నారు. అయితే వీరు సివిల్స్‌లో అర్హత సాధించడానికి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్‌సైన్స్, ఆంత్రోపాలజీ వంటి కోర్సులను ఎక్కువగా ఎంచుకుంటున్నారు. వీటిని హెచ్ఈసీ కోర్సు పూర్తి చేసిన వారు సులభంగా ఆకళింపు చేసుకోవచ్చనే విషయం చాలామందికి తెలియదు. ఇంటర్ హెచ్ఈసీ పూర్తి చేసిన తర్వాత ఉన్నత విద్యాపరంగా ఎన్నో అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. సర్టిఫికెట్ కోర్సుల నుంచి డిగ్రీస్థాయి వరకు వివిధ కోర్సులను వీరు అభ్యసించవచ్చు. హెచ్ఈసీ ఇంటర్మీడియట్ పూర్తిచేసుకున్న విద్యార్థులు డిగ్రీ స్థాయి బీఏలో చేరొచ్చు. ఇటీవల కాలంలో జాబ్ మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా బీఏ డిగ్రీ కూడా ఆధునికత సంతరించుకుంటోంది. వివిధ విశ్వవిద్యాలయాలు బీఏలో కొత్త కాంబినేషన్లు తీసుకువస్తున్నాయి. ఇటీవలకాలంలో హెచ్ఈసీ అర్హతగా ప్రవేశం లభించే బీఏ కోర్సులలోనూ పలు జాబ్ ఓరియెంటెడ్ గ్రూప్ కాంబినేషన్స్ (ఉదా: సోషల్‌స్టడీస్, సోషల్‌సైన్సెస్, ఆర్కియాలజీ, ఆంత్రోపాలజీ తదితర) అందుబాటులోకి వస్తున్నాయి.

**సత్వర ఉపాధికి ఇంటర్ ఒకేషనల్ కోర్సులు (వృత్తివిద్యాకోర్సులు)**

నేటి పోటీ ప్రపంచంలో నిరుద్యోగ నిర్మూలనకు, స్వయం ఉపాధి కల్పనకు వృత్తివిద్య ఎంతగానో దోహదం చేస్తుంది. ఆర్థిక స్తోమత దృష్ట్యా పైచదువులకు వెళ్లలేని వాళ్లకు సత్వర ఉపాధికి ఒకేషనల్ కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయి. 1 ఉపాధి, 2 ఉపాధి, 3 ఉపాధితోపాటు ఉన్నతవిద్య..ఈ మూడింటిలో దేనిని ఎంచుకోవాలనుకున్నా అందుకు చక్కగా సరిపోయేవి ఇంటర్మీడియట్ వృత్తివిద్యా కోర్సులు, ఇంటర్మీడియట్ బోర్డు ఈ ప్రయోజనాలన్నిటినీ క్రోడీకరించి ఈ కోర్సులను రూపొందించడం జరిగింది.



ఇంటర్మీడియట్‌తోనే ఉన్నత విద్య, ఉద్యోగాలు, స్వయం ఉపాధి మార్గాలను ఈ కోర్సులు చూపిస్తున్నాయి. ఆఫీస్ అడిస్ట్రేషనల్‌షిప్ నుంచి ఆటోమొబైల్ ఇంజనీరింగ్ టెక్నీషియన్ వరకూ టెక్నికల్, అడ్మిస్ట్రేషన్ విభాగాలకు అవసరమైన స్కిల్స్ పొందేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాయి. పదవతరగతి తర్వాత కేవలం రెండేళ్ల వృత్తివిద్యకు కేటాయించడం ద్వారా వెంటనే ఉపాధి సంపాదించుకోవచ్చు. పాక్షికంగా ఉపాధి పొందుతూ కూడా ఉన్నత విద్యాభ్యాసం చేయవచ్చు. అంతేకాదు స్వయం ఉపాధి పొందుతూ మరి కొందరికి ఉపాధిని కూడా అందించవచ్చు. దీనిని బట్టి ఉన్నత విద్యకు సాధారణ ఇంటర్మీడియట్ వారధిలాంటిదైతే, ఉపాధికి మాత్రం ఇంటర్మీడియట్ వృత్తి విద్యాకోర్సులు నిచ్చెనల్లాంటివని చెప్పవచ్చు. ఇంటర్మీడియట్ విద్యా డైరెక్టరేట్‌లో విభాగమైన రాష్ట్రవృత్తి విద్యాసంస్థ (స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఒకేషనల్ ఎడ్యుకేషన్-ఎస్.ఐ.వి.ఐ) దాదాపు 27 కోర్సులలో ఈ వృత్తివిద్య అందిస్తోంది. ఈ కోర్సుల ద్వారా లభిస్తున్న ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఈ కోర్సులను అభ్యసించే వారి సంఖ్య క్రమేపీ పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం రెండు తెలుగురాష్ట్రాల్లోని ఇంటర్మీడియట్ బోర్డులు అగ్రికల్చర్, బిజినెస్ అండ్ కామర్స్, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, హోంసైన్స్, హ్యుమానిటీస్, పారా మెడికల్ విభాగాల్లో మొత్తం 27 రకాల ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉంచాయి. ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగంలో ఆటోమొబైల్ ఇంజనీరింగ్ టెక్నీషియన్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ టెక్నీషియన్, ఎలక్ట్రికల్ వైరింగ్ అండ్ సర్వీసింగ్ ఆఫ్ ఎలక్ట్రికల్ అప్లయన్సెస్, రూరల్ ఇంజనీరింగ్ టెక్నీషియన్ కోర్సులు పూర్తిచేస్తే..ఎలాంటి ప్రవేశ పరీక్షలు అవసరం లేకుండానే సంబంధిత బ్రాంచ్‌లో నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశించవచ్చు. వీటిని ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ కళాశాలల్లో కూడా అందిస్తున్నారు. వృత్తి విద్యలో రెండేళ్ల ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసిన వారు ఎంసెట్‌కు కూడా హాజరు కావచ్చు. కరెస్పాండెన్స్ కోర్సు ద్వారా కూడా పాలిటెక్నిక్ చేయవచ్చు. వివిధ కంపెనీలు ప్రతీ సంవత్సరం ఏర్పాటు చేసే జాబ్‌మేళాలు, అప్రెంటిస్‌షిప్ మేళాలు ద్వారా ఒకేషనల్ కోర్సు చేసిన వేలాది మందికి ఆరంభంలోనే కనీసం రూ.6000 నుంచి రూ.10,000 వేతనంతో కూడిన ఉపాధి లభిస్తూ ఉండటం వలన ఈ కోర్సులకు క్రమేపీ ఆదరణ పెరిగింది. టెన్త్ తర్వాత రెండేళ్లకే ఒక సాంకేతిక విద్యానిపుణుడిగా తయారయ్యే అవకాశాన్ని కల్పి స్తున్న ఈ కోర్సుల్లో చేరితే పెరుగుతున్న సాంకేతిక అవసరాలను ఉపాధికి అనుకూ లంగా మలచుకునే అవకాశముంది.

బ్రాంచ్ అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో అవకాశాలుంటాయి. ప్రభుత్వ రంగంలో రైల్వేలు, గెయిల్, సెయిల్ వంటి భారీ కంపెనీల్లోనూ అవకాశాలను ఈ కోర్సు పూర్తి చేసినవారు అందింపుచ్చుకోవచ్చు.

– రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు (ఏపీఆర్‌జేసీ) (టీఎస్ఆర్‌జేసీ) విద్యార్థులకు ప్రామాణికమైన విద్యను అత్యంత ప్రశాంత వాతావరణంలో

అందించాలనే ఆలోచనలతో ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాలు 1972లో ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో పట్టణాలు, నగరాలకు దూరంగా, విద్యకు ఎటువంటి ప్రతిబంధకాలు లేని ప్రాంతాల్లో ప్రత్యేక సదుపాయాలను కల్పించి, విద్యార్థుల ఏకాగ్రతను పెంచే దిశగా ఇవి పని చేస్తూ సత్ఫలితాలను సాధిస్తున్నాయి. దీంతో గురుకుల విద్యాలయాల పట్ల ఆదరణ పెరిగింది. రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఎంపిక అనేది ప్రవేశపరీక్ష ద్వారా ఉంటుంది. ఈ కళాశాలల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు సొసైటీ ఉచిత విద్య, హాస్టల్ సౌకర్యాలను కల్పిస్తోంది. ఎక్కడా రాజీపడకుండా నాణ్యమైన విద్యను అందిస్తోంది. ప్రతీ సంవత్సరం ఈ కళాశాలల్లో దాదాపు 90 శాతం ఉత్తీర్ణత ఫలితాలు సాధిస్తున్నాయి. కొన్ని కళాశాలలు అయితే వంద శాతం ఉత్తీర్ణతను సాధిస్తున్నాయి. ప్రధానంగా పేద విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడంలో ఇవి విశిష్ట కృషి చేస్తున్నాయి. వీటిలో ప్రవేశానికి రెండు తెలుగు రాష్ట్రాలు ప్రత్యేకంగా సెట్‌లు (టీఎస్‌ఆర్‌జెసీ సెట్, ఏపీఆర్‌జెసీ సెట్) నిర్వహిస్తున్నాయి. ఇందులో ఉత్తీర్ణత సాధించి ప్రవేశం ఖరారు చేసుకుంటే పూర్తిస్థాయి రెసిడెన్షియల్ విధానంలో బోధనతో పాటు విద్యార్థులను ఎంసెట్, సీఏ సీపీటీ తదితర ప్రవేశ పరీక్షలకు సన్నద్ధులను చేసే విధంగా ప్రత్యేక శిక్షణ సైతం లభిస్తుంది.

### ట్రిపుల్ ఐటీలు

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థులలో కొంత మంది ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక సమస్యల కారణంగా పది తర్వాత చదివే స్థోమత లేక ఫుల్‌స్టాప్ పెట్టేస్తారు. ఇలాంటి వారి కోసం ఎన్నో మార్గాలున్నాయి. ఇంటర్‌తో పాటు ఇంజినీరింగ్ విద్యను ఆరేళ్లు ఉచితంగా చదువుకోవడానికి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ట్రిపుల్ ఐటీలు ఉన్నాయి. పదో తరగతిలో సాధించిన గ్రేడ్ పాయింట్లు లేదా పరీక్షల్లో చూపిన ప్రతిభతో వీటిలో ప్రవేశాలు పొందవచ్చు. కోర్స్ పూర్తి అయ్యేనాటికి క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా అనేకమంది ఉపాధి పొందుతున్నారు.

### ఐటీఐ/ఐటీసీ

పదో తరగతి తర్వాత ఒకటి రెండేళ్ల తక్కువ వ్యవధిలోనే సాంకేతిక విద్యలో నైపుణ్యం పొందే అవకాశం కల్పిస్తున్న ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ప్రభుత్వ), ఇండస్ట్రియల్ ట్రైనింగ్ సెంటర్(ప్రైవేటు)లు సాంకేతిక రంగంలో శిక్షణ ఇచ్చే సంస్థలు. ఇవి కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్(డీజీఈటీ) పర్యవేక్షణలో పని చేస్తున్నాయి. మూడు నెలల నుంచి మూడేళ్ల కాల పరిమితిగల ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, ప్లంబర్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, టర్నర్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషనింగ్ తదితర కోర్సులు చదవవచ్చు. ఈ కోర్సులు పూర్తయ్యాక అప్రెంటీస్‌గా పనిచేయవచ్చు. ఈ విధమైన కోర్సులను



పూర్తి చేసిన వారికి రైల్వే, ఆర్మీ, పోలీసు, పారామిలిటరీ తదితర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగావకాశాలుంటాయి. ఐటీఐ కోర్సుల్లో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఒకేషనల్ ట్రైనింగ్ పరిధిలో ఆయా రాష్ట్రాల్లోని ప్రాంతీయ ఒకేషనల్ ట్రైనింగ్ కౌన్సిల్స్ ప్రవేశ ప్రక్రియలు నిర్వహిస్తాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో వందల సంఖ్యలో ఐటీఐలు ఏర్పాటయ్యాయి. ఐటీఐ పూర్తయ్యాక పారిశ్రామిక సంస్థల్లో ఎంట్రీ లెవల్లో టెక్నీషియన్స్‌గా అడుగు పెట్టొచ్చు. అదేవిధంగా అప్రెంటీస్‌షిప్ పూర్తి చేసుకుని ఎన్‌సీవీటీ నిర్వహించే అప్రెంటీస్‌షిప్ సర్టిఫికెట్ పొందితే ఉద్యోగ సాధనలో మరింత ప్రాధాన్యత లభిస్తుంది.

### పాలిటెక్నిక్ కోర్సులు

ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో ఎక్కువ కాలం చదువుకు కేటాయించలేమని భావించే వారికి చక్కని మార్గం పాలిటెక్నిక్ కోర్సులు. పదో తరగతి పూర్తి చేసిన తర్వాత ఇంజినీరింగ్ డిగ్రీ అందుకోవాలంటే రెండేళ్ల ఇంటర్మీడియట్, నాలుగేళ్ల ఇంజినీరింగ్ చదవాలి. ఆర్థికంగా అంత స్థోమత లేనివాళ్లు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పదో తరగతి తర్వాత మూడేళ్లకే సాంకేతిక విద్యలో డిప్లొమా పొందడానికి పాలిటెక్నిక్‌ను ఎంచుకోవడం ఉత్తమం. ఎందుకంటే పదో తరగతి అర్హత తోనే సాంకేతిక విద్యను అందుకొని సుస్థిర కెరీర్‌కు మార్గం వేసుకునే అవకాశాలను పాలిటెక్నిక్ కోర్సులు కల్పిస్తున్నాయి. ప్రధానంగా తక్కువ ఖర్చుతో పూర్తయ్యే పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు యువత సత్వర ఉపాధి పొందేందుకు వీలు కల్పిస్తున్నాయి. ఈ కోర్సులో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, కంప్యూటర్ ఇంజినీరింగ్, ఐటీ, మైనింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ వంటి మూడేళ్ల డిప్లొమా కోర్సులతో పాటు మెటలర్జికల్ ఇంజినీరింగ్, కెమికల్ ఇంజినీరింగ్ తదితర మూడున్నరేళ్ల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు గార్మెంట్ టెక్నాలజీ, క్రాఫ్ట్ టెక్నాలజీ, లెదర్ టెక్నాలజీ, ఫుట్‌వేర్ టెక్నాలజీ, టెక్స్‌టైల్, సిరామిక్ టెక్నాలజీ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసినవారు చదివిన బ్రాంచ్‌కు అనుగుణంగా సంబంధిత పరిశ్రమల్లో సూపర్‌వైజర్ స్థాయి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

### జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు

పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఇంటర్‌కు ప్రత్యామ్నాయంగా పలు జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. హోటల్ మేనేజ్‌మెంట్, టూరిజం మేనేజ్‌మెంట్, ఫ్యాషన్ టెక్నాలజీ, ఏవియేషన్ వంటి కోర్సులు కాస్త ఖరీదైనప్పటికీ సృజనాత్మకత ఉన్న విద్యార్థులకు ఆయా రంగాల్లో చక్కటి అవకాశాలు కలిగిస్తున్నాయి. అయితే, ఈ కోర్సుల్లో చేరే విద్యార్థులు తాము చేరుతున్న విద్యాసంస్థలకు అఫిలియేషన్ ఉందా, ఉద్యోగ అవకాశాలు ఎలా ఉంటాయి తదితర విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి నిపుణుల సలహా తీసుకుని చేరడం మంచిది. ఎందుకంటే చాలా మోసపూరిత సంస్థలు ప్రభుత్వ అనుమతి లేకుండా స్థాపించి పెద్ద ఎత్తున ఫీజులు వసూలు చేసి ఉడాయించడం నేడు నిత్యకృత్యం అయిపోయింది.

**స్వయం ఉపాధి కోర్సులు**

ఉన్నత విద్యనభ్యసించడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురైతే స్వయం ఉపాధి దిశగా కూడా ఎన్నో సంస్థలు స్వల్పకాలిక శిక్షణ కోర్సులను అందిస్తున్నాయి. సెట్విన్, స్వామిరామానంద తీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్, ఏపీ ఇంటర్మీడియట్ బోర్డ్, ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ వంటి సంస్థలు ప్రస్తుత జాబ్ మార్కెట్‌కు అవసరమైన ఎన్నో కోర్సులను అతి తక్కువ రుసుముకే అందిస్తున్నాయి.

**దూర విద్య**

పై చదువులపై పెద్దగా ఆసక్తి లేనివాళ్లు పది అర్హతతో ఉన్న ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తూనే దూరవిద్యలో దారులు వెతుక్కోవచ్చు. కాలేజీకి వెళ్లి చదవడం వీలు కానివారు ఓపెన్ స్కూల్ లేదా ఇగ్నో నుంచి నచ్చిన కోర్సుల్లో నైపుణ్యాలు పెంచుకోవచ్చు. సాధారణంగా పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు 16 సంవత్సరాలు నిండి ఉంటాయి. కానీ, చాలా ఉద్యోగాలకు పదవ తరగతి పూర్తి చేసి 18 ఏళ్లు నిండి ఉండాలనే నిబంధన ఉంది. అయితే ఈ 18 సంవత్సరాల లోపు ఉపాధికి దోహదపడే ఏదయినా డిప్లొమా కోర్స్ కూడా చేసుకోవచ్చు.

**సెంట్రల్ పోలీస్ ఆర్గనైజేషన్స్**

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ సెంట్రల్ పోలీస్ ఆర్గనైజేషన్స్-సీపీవో(భద్రతా విభాగాలు)లో పదవ తరగతి ఉత్తీర్ణతతో కానిస్టేబుల్(జనరల్ డ్యూటీ) పోస్టుల భర్తీ చేస్తుంది. సీపీవో పరిధిలోని ప్రధాన విభాగాలైన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్), ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీఎఫ్) వంటి ఉద్యోగాలకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నియామకం చేస్తుంది.

**త్రివిధ దళాలు**

దేశ రక్షణకు శ్రమించే ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ విభాగాల్లో ఏటా ఉద్యోగాల భర్తీ జరుగుతుంది. వీటిలో పదో తరగతి ఆధారంగా లభించే ఉద్యోగాల వివరాలు.. ఇండియన్ ఆర్మీ సోల్జర్లు, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ఎయిర్‌మన్ ఉద్యోగాలు, ఇండియన్ నేవీలో కుక్స్, స్టీవార్డ్ ఉద్యోగాలు. పదవ తరగతి ఉత్తీర్ణత ఆధారంగానే రైల్వేలో రక్షణ విభాగానికి చెందిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్/రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్‌లో కానిస్టేబుల్ పోస్టులను రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ నియమిస్తుంది.

పదో తరగతి తరువాత ఇన్ని రకాలైన కోర్సులు ఉన్నప్పటికీ వాటికి సంబంధించిన సమగ్ర సమాచారం తెలియకపోవడం వలన కోర్సుల ఎంపికలో పొరపాట్ల వలన విద్యార్థులు ఎంతగానో నష్టపోతున్నారు. కొందరు తల్లిదండ్రులు అయితే తాము చదువుకునే సమయంలో తాము బ్యాంక్ ఆఫీసర్ కావాలనో, ఇంజినీర్ లేదా డాక్టర్ కావాలనో కోరుకుంటారు. కానీ నిజ జీవితంలో తన ఆర్థిక పరిస్థితులు



సహకరించక ఆ కోరిక తీరక ఓ సాధారణ ఉద్యోగంలో స్థిరపడిపోయినప్పటికీ అప్పటి తన కోరికను తన పిల్లల ద్వారా తీర్చుకోవాలి అనే కోరిక వారిలో బలంగా పెనవేసుకుని ఉంటుంది. ఈ సందర్భంలో తన పిల్లలకు ఆ వృత్తులపై ఆసక్తి ఉందా లేదా అని గమనించకుండా పదవ తరగతి పిదప వారి ఇష్టత గమనించకుండా తన ప్రోద్బలంతోనే తన అభీష్టానికి అనుగుణమైన గ్రూపులో జాయిన్ చేయడం పిల్లలు దానిలో సక్సెస్ కాలేకపోవడం జరుగుతుంది. నేను ఇక కొనసాగలేను అని పిల్లలు ఎంత మొత్తుకున్నా కోర్సు మార్చకుండా మరికొంత కష్టపడు, మంచి భవిష్యత్ వస్తుంది అంటూ నచ్చచెబుతూ బలవంతాన కొనసాగిస్తున్న నేపథ్యంలో ఆ వత్తిడి భరించలేక కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థుల బలవన్మరణాలు మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. ఈ పరిస్థితి కేవలం ఇంటర్మీడియట్ విద్యలోనే ఎక్కువగా కనిపిస్తూ ఉంది. పదిలో సామాన్య మార్కులు వచ్చినవారు ఇంటర్‌లో ఎంపీసీలో సక్సెస్ అయినవాళ్లు ఉన్నారు. దీనిని బట్టి పదవ తరగతి మార్కులే అన్ని సందర్భాలలో కోర్స్ ఎంపికకు ప్రమాణం కాదని గుర్తించాలి. మరికొందరు విద్యార్థులు అయితే తమ సామర్థ్యానికి అనుగుణమైన కోర్స్ గురించి తెలిసినప్పటికీ తన స్నేహితులు వేరే గ్రూపులో ఉన్నారనే కారణంతో తనకు సరిపడని గ్రూపులోనే కొనసాగుతూ తన కెరీర్ మొత్తాన్ని నాశనం చేసుకుంటు న్నారు. ఈ విషయం గ్రహించే సమ యానికి జరగవలసిన నష్టం జరిగిపో తుంది. అయితే పది తరువాత కోర్సుల ఎంపికలో స్వతహాగా నిర్ణయం తీసుకునే విద్యార్థులు లేకపోలేదు.

**కార్పొరేట్ మాయాజాలం**

పదో తరగతి ఫలితాలు వెలువడక ముందే అన్ని కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రచార మోత మోగిస్తూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఒక విధమైన మానసిక సంఘర్షణకు గురి చేస్తున్నాయి. చాలా మంది విద్యార్థులను ఇష్టం లేకున్నాల సైన్స్ కోర్సుల్లో చేర్పిస్తున్నారనే వాదన కూడా బలంగా ఉంది. ఒకరిని చూసి మరొకరు తమ పిల్లలపై బలవంతంగా ఇలా కోర్సులను రుద్దడానికి ప్రయత్నిస్తే చివరికి అదే వారి కెరీర్ పాలిట శాపంగా మారే ప్రమాదముందని గుర్తుంచుకోవాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో నేటి విద్యావ్యవస్థలో కూడా ఎప్పటికప్పుడు నూతన కోర్సులు ఆవిష్కృతమవు తున్నాయి. వీటి సమాచారం కూడా ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల వారికి చేరువ కావడం లేదు. ఎప్పుడైతే పది తరువాత ఉండే విద్యావకాశాలు తదుపరి ఉపాధి అవకాశాల సమాచారం ఎప్పుడైతే సంపూర్ణంగా లభిస్తుందో అప్పుడు విద్యార్థులకు కోర్సుల ఎంపికలో సౌలభ్యత చేకూరుతుంది. అయితే నేటి అవాంఛ నీయ పోటీ ప్రపంచంలో మార్కులు ర్యాంకులు పరమావధిగా సాగుతున్న విద్యా విధానంలో పిల్లల అభిరుచులు ఆసక్తి అనేది గురువులు గమనించే అవకాశం కూడా లేదు. అందుచేత పిల్లలకు పాఠాల బోధనే కాదు వారి మనో సామ ర్థ్యం, వారి భావి ఆలోచనలు గుర్తించి మార్గదర్శనం చేయడానికి కౌన్సెలింగ్ అందించడానికి ప్రతీ హైస్కూల్‌లో ప్రత్యేకంగా ఓ కౌన్సెలర్‌ను నియామకం చేస్తే చాలావరకు పిల్లల్లో ఓ స్పష్టమైన అవగాహన వచ్చి మంచి కెరీర్‌ను నిర్మిం చుకోవడానికి దోహదపడుతుంది. అప్పుడే పది తరువాత వేసే అడుగు ఆచి తూచి పదిలంగా వేయడం జరుగుతుంది. బంగారు భవిష్యత్ వారి స్వంతం అవుతుంది. ❑



# వెన్నెల పూతరేకు

**నేల** నేలంతా
చాపగా పరుచుకుంటుంది
వెన్నెల పూతరేకుల కోసం!
నేల మీది సమస్త వృక్షజాలమూ.
నేల మీది సర్వ సౌధాలూ/ వెన్నెల పూతరేకుల కోసం
కుండల వీపులై సిద్ధమవుతాయి!
ఈ వెన్నెల పూతరేకు
కళ్ళకి రుచులు చూపిస్తుంది
ఒంటికి మఖమల్ వస్త్రపు
హాయిని కలిగిస్తుంది
కొబ్బరి నీళ్ల నదీ కెరటాలై
దోసిళ్లలో దోబూచులాడుతూ ఉంటుంది
శాంతికీ, స్వస్థతకీ
పరమౌషధం ఈ వెన్నెల పూతరేకు
రాత్రుళ్లు ఆరుబయట ఆరగిస్తే
ఈ వెన్నెల పూతరేకు వన్నెల రాణి అవుతుంది
విద్యుత్ తీగెలని కాకుండా
వెన్నెల కిరణాలని
వొళ్ళంతా చుట్టుకోవాలి!

**- ఒబ్బిని**

## ఓ హృదయమా!

**నీలి** రంగు జలపాత లయల్లో
పచ్చని ఆకృతుల సొగసుల్లో
సొగసైన నీ రూపాన్ని వెతుకుతూ
వెన్నెల నక్షత్రాల్ని లెక్కిస్తున్నాను
రెప్ప వాల్చని క్షణాల సవ్వడిలో
కొత్తగా నీ ఊసుల ఊహల్ని
కాలం కాన్వాసుపై సరికొత్తగా లిఖిస్తున్నాను.
అంతరంగ దొంతరలో నిక్షిప్తమైన నీ మునగురుల
మృదు భాషను మరోమారు వింటూ కలగంటున్నాను.
ఓ హృదయమా.. వినుమా..
హృదయ బడబాగ్నిని నీ కనులారా వీక్షించుమా!!

**- చిల్లెం మహబూబ్ బాషా**



## ఈ వారం కవిత్వం

**పరిచిన** దారుల్లో
తెలిపిన తోవల్లో
మీ గమనాలు
బహు వేగం!
ముందుకు సాగే
మార్గమే లేక
మా గమనాలు
అతి భారం!



వేగం తగ్గుతుంది మీకు!
మేమర్పరుచుకున్న మార్గం
నడిచి తిరిగిన మార్గం
ఆత్మస్థైర్యంతో నడుస్తాం
వేగం పెరుగుతుంది మాకు!

## స్పష్టత-అస్పష్టత

స్పష్టమైన దారుల్లో
కోరుకున్న గమ్యం వైపు
క్షణం ఆలోచించక
దూసుకెళ్తారు మీరు
అస్పష్టమైన మార్గాన
గుంతలు పూడుస్తూ
ఊబిలు తప్పుకుంటూ
జాగ్రత్తగా నడుస్తాం మేం
ఆలోచన్లకి అవకాశం లేక
మీ మెదళ్లు మొద్దుబారతాయ్
ఎప్పుడూ అప్రమత్తమై
మా మెదళ్లు రాటుదేలుతాయ్!
గుడ్డిగా నమ్మిన మార్గం
గతి తప్పుతుందనిపిస్తే
తత్తరపడ్తారు అనుమానిస్తారు
అస్పష్టతతో అనుమానంతో
మార్గయానం జేస్తూ మీరు!
స్పష్టతతో ధైర్యంగా సూటిగా
గమ్యానికి పయనిస్తూ మేము!

**- రవి కిషోర్ పెంట్రాల**



# పుస్తక సమీక్ష



## సృష్టి-ప్రకృతి-మనిషి

'సృష్టి-మనిషి, ప్రకృతి' వీటిని మించిన కవితా వస్తువులు బహుశా! వుండవేమో! సత్తా వుండాలే కాని కావల్సినంత కవిత్వాన్ని చేదుకోవచ్చు. అందుకేనేమో కవి నార కృష్ణమూర్తి ఏకంగా 92 కవితలతో 200 పుటల కవిత్వ పొత్తాన్ని ప్రకటిస్తున్నారు. 'మనిషి రూపాల్లో/ ఒకటి పురుషరూపం/ మరొకటి స్త్రీ రూపం/ స్త్రీ లేనిదే సృష్టి లేదు/ సృష్టికారకుడు పురుషుడు' అంటూ సృష్టి రహస్యాన్ని విశదపరుస్తున్నాడు నారవారు. మనిషి జీవనదశల్లో వృద్ధాప్యం చివరిది. 'వ్యక్తిత్వం వృద్ధాప్యాన్ని ప్రశ్నిస్తుంది/ నువ్వెందుకు జీవిస్తున్నావని?/ కాలమే బదులిస్తుందని/ జీవితం కడదాకా సాగాలని' సాటివారికి సహకరిస్తూ, బ్రతుకు బాధ్యతల్ని నిర్వహిస్తు, శరీరం క్షీణిస్తున్నా ధర్మాన్నే పాటిస్తూ, సద్భావనతో బ్రతుకు సాగించడమే మనిషి జీవిత పరమార్థమని హితవు పలుకుతున్నాడు. 'కొండల్ని కూల్చడం/ వృక్షాల్ని నరకడం/ వాగువంకలను మూయడం/ వాతావరణాన్ని కలుషితం చేయడం/ మనం చేసే తప్పిదాలు మానేస్తే/ మానవ జీవితాలకెంతో శాంతి' అని ప్రవచిస్తున్నాడు ప్రకృతి ప్రేమికుడైన కృష్ణమూర్తి. యిలా తన మనసులో చెలరేగిన భావతరంగాలను ఒడిసిపట్టి అమ్మ, స్త్రీ, ప్రేమ, సామాజిక అపసవ్యతలు యిత్యాది వైవిధ్యభరిత అంశాలను కవితలుగా మలచి మలచి మనకందిస్తున్నాడు ఈ కవి. 72 ఏళ్ల వయస్సులో కవితాసృజనతో సేదతీరుతున్న నారకృష్ణమూర్తి ముమ్ముందు మరింత మంచి కవిత్వంతో మనముందుకు రావాలని నా ఆకాంక్ష.

**(సృష్టి-ప్రకృతి-మనిషి, రచన: నారకృష్ణమూర్తి, వెల: రూ 300, ప్రతులకు: ఇ.నం. 1-9-49/ఎ1, సౌమ్య హాస్పిటల్ దగ్గర, వీధి నెం.18, ముషీరాబాద్, హైదరాబాద్)** – రమణ వెలమకన్ని



## యాత్రావిశేషం-పద్యరసోదయం

పద్యాన్ని హృదయానికి అద్ది ఛందోబద్ధమైన కవిత్వం సృజనకు పూనుకున్నారు కవి శేషం రామానుజాచార్యులు. హంపీ క్షేత్రాన్ని సందర్శించిన అనంతరం వీరిలో ఎదిగిన భావవీచికలు పద్యాలై ప్రవహించాయి. ఆచార్య ఎన్.గోపి అన్నట్లు ఇది 'యాత్రాచరిత్ర కావ్యం'. యాత్రా చరిత్రకు కవి అదనంగా పద్యవైభవం అనే పరిమళాన్ని పులిమి మనకు అందిస్తున్నారు. ఆనవాయితీగా సుకవిస్తుతితో మొదలిడి విరూపాక్ష దేవాలయం, తుంగభద్ర నది,నరసింహస్వామి విగ్రహం, రాయల వారి కాలంలో నిర్వహింపబడే వసంతోత్సవ వేడుకలు, నాటి విపణి వీధులు, స్నానవాటికలు, పంపానది, మాల్యగిరి, ఋష్యమూక పర్వతము వంటి చారిత్రిక ప్రాధాన్యత సంతరించుకున్న స్థలాలే కాక రాయల వ్యక్తిత్వం, మంత్రి తిమ్మరుసు పరిపాలనా సంపూర్ణత్వం కవి చేకూర్చినాడు. హంపీ స్థల వివరణ ఒక ఎత్తు కాగా రామానుజాచార్యుల పద్యప్రౌఢిమ మరో ప్రశస్థమైన విషయం. మొత్తం 132 పద్యాలలో కవిత్వ పటిమ, అలంకార వైభవం, మలయమారుతము తాకినట్లుగా రసమాధుర్యం ప్రవాహమై ఉప్పొంగి అలరించింది. శ్రీకృష్ణదేవ రాయల వారి వ్యక్తిత్వం, శీతాంశతేజుడైన తిమ్మరుసు మంత్రి బుద్ధికుశలతను తెలియజేసినారు. యాత్రా విశేషాలను ఒక 'సుమ ధుర కావ్యంగా వెలయించి అందించిన ఘనత బహుశా శేషం రామానుజాచార్యులకే దక్కుతుందనడటంలో ఏ మాత్రం అనౌచిత్యము లేదు.

**(అహో! ఆంధ్రభోజా!, రచన: శేషం రామానుజాచార్యులు, వెల: రూ 200, ప్రతులకు: శేషం సుమన్, 27, ఫేస్-4, హైదరాబాద్)** – కూర చిదంబరం



## 'ముళ్లపూడి-బాపుల' అద్భుత కళా సృష్టి 'రాధాగోపాలం'

సరసమైన కథలలో సరదా అలకలు సృష్టిస్తూ, సంసార పక్షంగా ఆహ్లాదాన్ని ఇచ్చే, ఇళ్లల్లో జరిగే రొమాంటిక్ కథలు, ఎన్ని ఏళ్లయినా చదివింపచేసి హాయి అనిపించే కథలను తెలుగు పాఠకులకు, కుటుంబీకులకు ముళ్లపూడి వెంకటరమణ కానుకగా ఇచ్చారు. బాపు కళాహృదయం, ఆ కథలలోని పాత్రలకు సజీవ తెలుగు అందం, ఇంటింటా కళ్లకుకట్టి రూపురేఖలతో సమ్మోహితంగా కళాత్మకంగా భావాలకు తగ్గట్టుగా సమకూర్చింది. బాపురమణల ఆత్మీయ బాంధవ్యం ఈ కథలలో ముళ్లపూడి వెంకటరమణ కథా చాతుర్య కల్పనా వైచిత్రి, బాపురేఖా చిత్రవిలాస మాధుర్యం కలిసిమెలిసి అద్భుత రచనా, చిత్రకళాసృష్టి మిళితమైంది.

ఒకప్పుడు ఆంధ్రపత్రిక వారపత్రికలలో, దశాబ్దా నాటి తెలుగు చదువరుల హృదయాలను ఆకట్టుకొన్న 'రాధాగోపాలం' కథాసంకలనం, కొత్త తరానికి అక్షర పబ్లికేషన్స్ అత్యంత రమణీయంగా తీర్చిదిద్ది ప్రముఖ రచయిత, చిత్రకారుడు, బాపురమణల ఆత్మీయులు 'శ్రీం' అందించటం ఎంతైనా అభినందనీయం. లహరి, రాధమ్మబాకీ, కుమారసంభవమ్, చుట్టాలొచ్చారు, తిమింగల గిలం అన్నీ రసగుళికలే.

**(రాధాగోపాలం, రచన: ముళ్లపూడి వెంకటరమణ, వెల: రూ 125, ప్రతులకు: అక్షజ్ఞ పబ్లికేషన్స్, 12-11-448, వారాసిగూడ, సికింద్రాబాద్-500061)**

– యర్రమిల్లి



## పాస్‌పోర్ట్ కథలు

మరికొన్ని డయాస్పోరా కథలు అనే ఈ పాస్‌పోర్ట్ కథల సంపుటిని మతుకుమల్లి సుశీలాసుబ్బారావుకి అంకితం చేసారు. వంగూరిచిట్టెన్‌రాజు, వేమూరి వేంకటేశ్వరరావు చక్కటి ముందుమాట రాసారు. ప్రవాసాంధ్రులు చక్కటి కవిత్వం, కథలు, సాహిత్య సేవ శ్లాఘనీయం దాదాపు 12 కథలు న్నాయి. అమెరికాలో మన తెలుగువారి స్థితి డాక్టర్లు సైతం ఆశ్చర్యపరిచే అక్కడి పరిస్థితుల్ని తెలియ జేసే కథ 'నేత్రదానం'. డా॥రమణ 'అమెరికా నుండి ఇండియా వచ్చి రెండు వారాలు ఉండి, తనతోపాటు మందులు, డాక్టర్లను తీసుకొని మెడికల్ క్యాంపు నిర్వహించేవారు, ఉచితంగా కాట్రాక్ట్ ఆపరేషన్లు చేయడం, ఐక్యాంప్ సొంత వూర్లోనూ ఫ్యాషన్లు, ఫ్రిడ్జిలూ, కార్లు, ఫోన్లు, ఎయిర్ కండీషన్స్ గదులూ ఎయిర్ కండీషన్డ్ కార్లూ ఇండియా గ్రామాల్లోనూ వున్నాయి.పర్యావరణ కార్యకర్తలు రమణను కలవడం వారి సంభాషణతో ఏకీభావం లేకపోవడం ఈ కథలో చూస్తాం. 'కోహినూర్' కథ మనదేశ శిల్ప, సాహిత్య, సాంస్కృతిపై రాసిన మంచికథ. మన నెమలి సింహాసనం, కోహినూర్ వజ్రం లాంటివి బ్రిటిష్ మ్యూజియంలో చూడటం, నరేంద్ర, పద్మ, మీనాక్షి, ప్రకాశం, పాత్రలు, వారి మధ్య సంభాషణలు తరువాత వాళ్ల ఢిల్లీ రావడం, జంతర్‌మంతర్, రాజ్‌మహాలు లాంటివి చూసి హైదరాబాద్ చేరడంలాంటి యాత్ర కథనంగా సాగిన కథే కోహినూర్. **(పాస్‌పోర్ట్, రచన: మాచిరాజు సావిత్రి, వెల: రూ 150, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్)** – తంగిరాల చక్రవర్తి





# వాల్ ఆర్ట్



ఒకప్పుడు గోడల మీద ఖరీదైన వాల్‌ఫ్రేమ్స్ కొలువుదీరే స్థలాన్ని ఇప్పుడు జ్యూట్ అలంకరణలు కొట్టేస్తున్నాయి. జనప నారతో చేసిన డెకార్ వాల్ ప్లేట్స్‌కి ఎవరికి వారు తమదైన సృజను జోడించవచ్చు. జనప నార రోలర్స్ తెచ్చుకొని, గమ్ సహాయంతో ఒక్కో వరుసను అతికించుకుంటూ ప్లేట్ షేప్‌కి తీసుకురావాలి. ఆ తర్వాత నచ్చిన రంగులను ఎంపిక చేసుకొని, అభిరుచికి తగిన డిజైన్‌ను వేసుకోవచ్చు. కొన్ని చిన్నవి, మరికొన్ని పెద్దవి జ్యూట్ ప్లేట్స్ సిద్ధం చేసుకొని, వాటిని లివింగ్ రూమ్‌లో ప్లెయిన్‌గా ఉండే ఒక గోడకు అలంకరించాలి. చూడగానే ఆకట్టుకునే ఈ వాల్ ఆర్ట్ అలంకరణ మాటల్లో వర్ణించలేనిది. ప్లెయిన్ జ్యూట్ మ్యాట్స్ పైన పిస్తాపప్పు షెల్స్, గవ్వలను గమ్‌తో అతికించి అందమైన డిజైన్‌ను తయారు చేయవచ్చు. తెల్లని పెయింట్‌తో ముగ్గులను అలంకరించి, ఆ జ్యూట్ మ్యాట్‌ను వాల్ డెకార్‌గా ఉపయోగించవచ్చు.

ఎండాకాలంలో పిల్లల చేత జ్యూట్ మెటీరియల్‌తో రకరకాల వస్తువులను తయారు చేయిస్తే వారిలోని సృజన బయట పడుతుంది. రీయూజ్ ఐటమ్స్ తయారీలో వేసవిలో పిల్లలను ఇలా ట్రైన్ చేయవచ్చు.

# మార్కెట్లో కొత్తగా..



## క్యాంపింగ్ స్టవ్

సుదూర ప్రయాణాల్లో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం కూడా ముఖ్యమే. అందుకే చాలామంది క్యాంపింగ్ లగేజ్‌లో కుక్‌వేర్‌ని కూడా భాగం చేసుకుంటూ ఉంటారు. అలాంటి వారికి ఈ క్యాంపింగ్ స్టవ్ బాగా నచ్చుతుంది. దీనిని ఒకసారి కొంటే ఇతరత్రా ఖర్చులు ఏమీ ఉండవు. బొగ్గులతో పాటు సమీపంలో ఉచితంగా దొరికే కట్టెలు, చెక్క ముక్కలు, ఎండిన ఆకులు, పుల్లలు ఇలా.. వేటితోనైనా నిప్పు రాజేసి, మంట పుట్టించి, దీనిపై వంట చేసుకోవచ్చు. గిన్నెలు, కళాయిలు, పాన్‌లు.. ఇలా వేటినైనా ఉపయోగించి



నచ్చిన రుచులను తయారు చేసుకోవచ్చు. పొడవాటి కట్టెలను పొయ్యికి దగ్గర్లో పెట్టుకోవడానికి వీలుగా ప్రత్యేకమైన స్టాండ్ కూడా ఉంటుంది. దీన్ని ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లడానికి మన్నికైన స్టోరేజ్ బ్యాగ్ లభిస్తుంది.

ట్రెండ్‌తో, టెక్నాలజీతో సంబంధం లేకుండా సరసమైన ధరల్లో మన్నికైన కుక్‌వేర్‌ని కొనేందుకు వినియోగదారులు ఎప్పటికప్పుడు సెర్చ్ చేస్తూనే ఉంటారు. కరకరలాడే కమ్మని రుచులను నిమిషాల్లో అందించగలిగే ఈ డీప్ ఫ్రైయర్ అలాంటిదే. 3 లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ డివైజ్‌లో పండుగలకు పిండివంటలు వండుకోవచ్చు. పార్టీలకు, ఫంక్షన్స్‌కి చికెన్ వింగ్స్, ఫ్రెంచ్ ఫ్రైస్ లాంటి వెరైటీలనూ గ్రిల్ చేసుకోవచ్చు. ఆయిల్‌ని బేస్ మెషిన్‌లో వేసుకుని లోపలున్న గ్రిల్ బాస్కెట్‌లో ఆహారాన్ని ఉంచుకుని, టేస్టీగా గ్రిల్ చేసుకోవచ్చు. దీనికి ట్రాన్స్‌పరెంట్ మూత కూడా ఉంటుంది. పట్టుకోవడానికి వీలుగా ప్రత్యేకమైన హ్యాండిల్స్ ఉంటాయి.

## పాకెట్ కుక్‌వేర్

ఇది ప్యాకెట్ గాడ్జెట్. దీన్ని ఫోల్డ్ చేసి జేబులో సులభంగా పెట్టుకోవచ్చు. నిజమే. ఫుడ్-గ్రేడ్ పాలిటెట్రా ఫ్లోరో ఎథిలీన్-కోటెడ్ ఫైబర్ గ్లాస్ మెటీరియల్‌తో రూపొందిన నాణ్యమైన ఒక షీట్ చతురస్రాకారంలో ఉంటుంది. దానికి ఒకవైపు అక్కడక్కడా ఉన్న పిన్స్‌ని లాక్ చేస్తే అది ఒక పాత్రలా తయారవుతుంది. దీనిలో ఒక మనిషికి సరిపడా ఆహారాన్ని ఉడికించుకోవచ్చు. ఒకవైపు ఓపెన్ పెట్టుకుని చిన్న చిన్న పాన్‌కేక్స్ వేసుకోవచ్చు. వంట అయిపోయిన తర్వాత తడి క్లాత్‌తో





లేదా టిష్యూతో క్లీన్ చేసుకోవచ్చు. హ్యాండిల్ సహాయంతో పట్టుకుని, కింద మంట వెలిగించి నచ్చిన ఆహారాన్ని తయారు చేసుకోవచ్చు. బిస్ ఫినాల్ రహిత పూతతో తయారైన ఈ మెటీరియల్ సురక్షితమైంది. అయితే అడవి ప్రాంతాల్లో, ఆహారం దొరకని సమయంలో, అత్యవసర పరిస్థితుల్లోనే దీన్ని ఉపయోగించడం మంచిది.

## పర్ఫెక్ట్ ఫ్రైయర్



ట్రెండ్‌తో, టెక్నాలజీతో సంబంధం లేకుండా సరసమైన ధరల్లో మన్నికైన కుక్‌వేర్‌ని కొనేందుకు వినియోగదారులు ఎప్పటికప్పుడు సెర్చ్ చేస్తూనే ఉంటారు. కరకరలాడే కమ్మని రుచులను నిమిషాల్లో అందించగలిగే ఈ డీప్ ఫ్రైయర్ అలాంటిదే. 3 లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ డివైజ్‌లో పండుగలకు పిండివంటలు వండుకోవచ్చు.
పార్టీలకు, ఫంక్షన్స్‌కి చికెన్ వింగ్స్, ఫ్రెంచ్ ఫ్రైస్ లాంటి వెరైటీలనూ గ్రిల్ చేసుకోవచ్చు. ఆయిల్‌ని బేస్ మెషిన్‌లో వేసుకుని లోపలున్న గ్రిల్ బాస్కెట్‌లో ఆహారాన్ని ఉంచుకుని, టేస్టీగా గ్రిల్ చేసుకోవచ్చు. దీనికి ట్రాన్స్‌పరెంట్ మూత కూడా ఉంటుంది.
పట్టుకోవడానికి వీలుగా ప్రత్యేకమైన హ్యాండిల్స్ ఉంటాయి.

కథ

# ప్రాప్తం

అమరావతిని చంద్రసేనుడు పరిపాలిస్తు, ప్రజల జీవన విధానం గురించి తెలుసుకునేందుకు మారువేషంలో తన మంత్రి సుబుద్ధితో కలసి తన రాజ్యంలోని పలు నగరాలు రాత్రులు సంచరిస్తూ ఉండేవాడు. ఒకరోజు అలా రాజధానిలో పర్యటిస్తున్న సందర్భంగా, తూర్పు వీధిలోని ఓ ఇంటిలో నుండి అర్థరాత్రి దాటినా దీపం వెలగడం గమనించి ఆయింటి అరుగుపై తన మంత్రితో చేరాడు, 'మీరు పూజారిగా ఇంతకాలం సేవలు చేస్తున్నప్పటికి ఆ దేవునికాని, మన రాజుగారు కాని ఏమైనా సహాయం చేసారేమో చూసారా?



మీకు వచ్చే ఆదాయంలో మన కుటుంబం పోషించుకోవడం చాలా కష్టంగా ఉంది. రేపు పిల్లల పెండ్లి ఎలా చేస్తాం? నాకు ఏమి తోచడం లేదు' అన్నది ఆడమనిషి స్వరం.

'పిచ్చిదానా నారు పోసినవాడు నీరు పొయ్యడా! రోజు నాచే అర్చన చేయించుకునే ఆ దైవానికి నా గురించి తెలియదా! మనరాజు మంచి వారే భయపడక కాలంపైన భారం వేసి ముందుకు సాగుదాం! నిద్రపో వేకువనే నేను ఆలయానికి వెళ్లాలి కదా!' అన్నది పురుషస్వరం.

వారి కుటుంబ కష్టాలు స్వయంగా తెలుసుకున్న రాజుగారు మరుదినం పెద్ద గుమ్మడికాయ తెప్పించి దానిలోపలి భాగం అంతా ఖాళీ చేయించి దాని నిండుగా బంగారు నాణాలు నింపి, ఎప్పటిలా గుమ్మడి కాయను అంటించి భటుల ద్వారా ఆ గుమ్మడిపండును మరుదినం ఉదయం పూజారి ఇంటికి పంపించాడు.

గుమ్మడికాయ పూజారి భార్యకు అందించి 'అమ్మా ఎవరో నాకు రెండు గుమ్మడికాయలు ఇచ్చారు. ఒకటి నేను తీసుకున్నాను, ఇదిగో మరొకటి మీరు తీసుకోండి' అని ఇచ్చి వెళ్లాడు రాజభటుడు.

మధ్యాహ్నం రాజుగారి వంటవాడు వచ్చి 'ప్రభూ ఈ రోజు తీసుకువచ్చిన కూరగాయలలో ఈ గుమ్మడికాయ వంట కొరకు కోయగా దీని నిండా బంగారు నాణాలు కనిపించాయి'అన్నాడు.

అది చూసిన చంద్రసేన మహారాజు ఆశ్చర్యపోయాడు. 'మహారాజా మానవ సహాయానికి దైవబలం కూడా తోడు అవ్వాలి. తన సహాయం పూజారికి తెలియకుండా దేవుడే పంపినట్లు అందజేయాలి అనుకున్నారు తమరు. ఆ పూటకు బియ్యం లేకపోవడంతో పూజారి భార్య అంగడిలో గుమ్మడికాయ ఇచ్చి బియ్యం తీసుకువెళ్లి ఉంటుంది. అదే అంగడిలో మన వంటవారు కూరగాయలు తీసుకురావడంతో ఆ గుమ్మడికాయ మన వంటశాలకు చేరింది' అన్నాడు మంత్రి.

**- డా॥బెల్లంకొండ నాగేశ్వరరావు**

## చుక్కలు కలపండి



# తెలుగు వెలుగు వెన్నెల

వార్త ఆదివారం

## బాలగేయం

### అమ్మాయి ఆటలు



అమ్మను చూసి నేర్చేరు
బొమ్మలు తెచ్చి ఆడేరు
వంట పాత్రలే పెట్టారు
అచ్చం అమ్మే అయ్యేరు
అరుగు మీద కొందరు
చెట్టు కింద కొందరు
ఇంటిలోన కొందరు
మిత్రులతో ఆడేరు
చూసినవారే మెచ్చేరు
ముసిముసిగా నవ్వేరు
అమ్మాయిల ఆటలు
భావితరానికి పునాదులు

**-పి. వెంకటేశ్వర్లు**



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- పి.వాణి,** నంద్యాల

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. 'ఎయిర్ కండిషనర్' ఆరోగ్యానికి చేటు కలిగిస్తుందా?

**జవాబు: వాణి!** దీనికి సమాధానంగా ముందు దీని పుట్టుక గురించి తెలుసుకోవడం మంచిది. వేసవిలో అమ్మకాల జోరందుకునే 'హెయిర్ కండిషన్ల' ద్వారా కొన్ని ప్రమాదకరమైన రసాయనాలు–వోలటైల్ ఆర్గానిక్ కంపౌండ్స్ కూడా గదుల్లో సరఫరా అవుతాయని, అందుకని ఏసీ రూముల్లోకి మిగతా సమయాల్లో గాలి ధారాళంగా ఆడేలా చూసుకోవాలని పరిశోధకులు సూచిస్తున్నారు. ఇంతకీ అసలు ఏసీలు పుట్టింది మనకు చల్లదనాన్ని ఇవ్వడానికి కాదు, 1902, జులై 17న తొట్టతొలి ఏసీ మిషన్‌ను ప్రారంభించింది 'బ్రూక్లీన్ ప్రింటింగ్ ప్రెస్'లో ముద్రిస్తున్న కాగితం. వేడి కారణంగా వ్యాకోచం చెందకుండా వుండేందుకు 1920లో అమెరికా సినిమా హాళ్లలో ఏసీలు అమర్చారు. దీనితో వేసవిలో టిక్కెట్ల కోసం జనం ఎగబడ్డారు. వాస్తవానికి మన ఇళ్లల్లో వాడేది, సినిమా థియేటర్లలో వాడేది 'ఎయిర్ కండీషనర్' కాదు! ఎయిర్ కూలర్ మాత్రమే. ఇది శరీరానికి తాత్కాలిక ఉపశమనం ఇస్తుంది కాని, ఆరోగ్యానికి మంచిది కాదు.

**- శామ్మేల్,** హైదరాబాద్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. పొట్లకాయ, కోడిగుడ్డు కలిపి వండిన కూరను తింటే తీవ్ర అనారోగ్యానికి గురవుతారట. ఎంతవరకు నిజం?

**జవాబు: శామ్మేల్!** ఇది కేవలం మూఢనమ్మకం. ఈ రెండింటినీ కలిపి వండిన కూర తింటే రోగం రాదు, మంచి పోషకాహారం అందినట్టు కాగలదు. ఈ రెండింటి సమ్మేళనం కొంతమందికి అయిష్టం కావచ్చు. రుచి ఏమాత్రం నచ్చకపోవచ్చు. పొట్లకాయ, కోడిగుడ్డులో పోషక విలువలు, చాలా ఖనిజలవణాలున్నాయి.

# ఆరోగ్యసిరి ఖర్జూరపండు





**ఒకప్పుడు** ఖర్జూరం అంటే పండు మాత్రమే ఎండిన లేదా తాజా ఖర్జూరాన్ని ఎప్పుడోగానీ తినేవారు కారు. కానీ నేడు ఈ పండ్ల రూపం మారింది. వినియోగం, విస్తరించింది. వివిధ రకాల వంటలు, మిఠాయిలు, ఐస్‌క్రీములు..ఇలా ఆయా రూపాల్లోకి రుచికరంగా మారుతోంది. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే..ఖర్జూరాలను అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో మనదేశం మొదటి స్థానంలో ఉంది. ఏటా 349 వేల టన్నుల ఖర్జూరాలను ఎడారి దేశాలైన ఇరాన్, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి దిగుమతి చేసుకుంటున్నాం.

## మెండుగా ఔషధాల గుణాలు

ఖర్జూర పండులో ఔషధ గుణాలు మెండు. ఈ పండ్లు ఫంగల్, బ్యాక్టీరియా, వైరస్ వ్యాధుల నుంచి కాపాడతాయి. పిల్లలు, గర్భిణులతో పాటు అందరికీ ఈ పండు వల్ల మేలు జరుగుతుంది. మధుమేహులు కూడా (పరిమితంగానే సుమా) హాయిగా తినవచ్చు. ఎందుకంటే డేట్స్‌లో గ్లైసమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. సహజసిద్ధమైన తియ్యదనం ఈ పండ్లకి ప్రత్యేకతను ఇస్తోంది. వీటితోపాటు ఎన్నోరకాల పోషక విలువలు ఈ పండు సొంతం. అందుకే డేట్స్ అనేక రూపా ల్లో మార్కెట్లో లభ్యమవుతున్నాయి. డేట్స్‌పేస్టు, సిరప్, వెనిగర్, షుగర్..ఇలా ఎన్నో రకాలుగా రూపాంతరం చెందు తోంది. చక్కెరకు బదులుగా డేట్ షుగర్‌ను, ఐస్‌క్రీములూ, జల్లీలు, సిరప్‌లు, జామ్‌లు కూడా మార్కెట్లోకి వచ్చేశాయి.

## చక్కెరలా

ఇటీవల కాలంలో డేట్ షుగర్ మంచిదా? సాధారణ చక్కెర మంచిది? అనే చర్చ బాగా ఊపందుకుంది. వైట్ షుగర్, బ్రౌన్ షుగర్ అనేవి చెరకు నుంచి తయారు చేసినవి. ఖర్జూర పండ్ల నుంచి గింజల్ని తీసేసి, కడిగి, ముక్కలుగా కోసి, ఎండబెట్టి గ్రైండ్ చేయడం వల్ల డేట్ షుగర్ తయారవుతుంది. ఖర్జూన గింజల్ని పొడి చేయడం వల్ల బ్రౌన్ డేట్స్ పౌడర్‌ని తయారుచేస్తారు. అందుకే డేట్స్ పౌడర్‌ను సహజసిద్ధమైన స్వీట్‌నర్‌గా చెబుతున్నారు ఆహార నిపుణులు. అందులో ఎలాంటి కృత్రిమ పదార్థాలు ఉండవు. ఈ పొడి దళసరిగా ఉంటుంది. చక్కెరలా తేలికగా కరిగిపోదు. కాఫీ, టీలలోకి బాగుండదు కానీ..బేకరీలు, చాక్లెట్లు, స్నాక్స్‌లో వినియోగించవచ్చు. ఈ పొడిని తయారుచేసే ప్రక్రియలో ఎలాంటి రసాయన చర్యలూ లేవు కాబట్టి ఖర్జూరాలలోని సహజగుణాలు అలాగే ఉంటాయి. పీచుపదార్థాలు, యాంటీఆక్సి డెంట్లు చెక్కుచెదరవు. ఖనిజ లవణాలకు చక్కని ఆధారం. డేట్ షుగర్ వల్ల ఆరోగ్యపరంగా కూడా ఎన్నో లాభాలున్నాయి. చక్కెరకు ప్రత్యామ్నాయంగా వాడడం వల్ల శరీరం తొందరగా శక్తిని కోల్పోదు. మెదడును చురుకుగా చేస్తుంది. ఇందులో కొలెస్ట్రాల్ లేదు. తేనెలా కాకుండా ఈ ఖర్జూర పొడిని తీసుకోవడం వల్ల ఎలాంటి అలర్జీలు రావు. అందుకే విద్యార్థులకు, క్రీడాకారులకు మంచిది. ఇన్ని విశేషాలు ఉండటం వల్ల బనానా బ్రెడ్, కుకీస్‌లలో దీన్ని వాడుతున్నారు. పెరుగు, యోగర్ట్, పళ్లు, కూరగాయల ముక్కల మీద కూడా ఈ పొడిని చల్లి అందంగా, ఆకర్షణీయంగా తయారు చేయడం విశేషం. ఏడాదంతా కనిపించే డేట్స్..రంజాన్ మాసంలో మాత్రం మార్కెట్‌ను కమ్మేస్తాయి. ఈ సీజన్‌లో రకరకాల డేట్స్ కనువిందు చేస్తాయి.



## ఇరాన్ నెంబర్ వన్

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 400 రకాల డేట్స్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. వీటి ఉత్పత్తిలో ఈజిప్టు మొదటి స్థానాన్ని పొందింది. ఏడాదికి పదిలక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఖర్జూరాలను ఈదేశం పండిస్తోంది. ఇక రెండో స్థానం ఇరాన్‌ది. ఏడాదికి తొమ్మిది లక్షల యాభై వేల టన్నుల డేట్స్ ఉత్పత్తి చేస్తోంది.





సౌదీ అరేబియా మూడో స్థానాన్ని ఆక్రమించింది. ఈ ఏడాది దేశం ఎనిమిది లక్షల టన్నులకు పైగా ఖర్జూరాలను ఉత్పత్తి చేస్తోంది. ఇటీవల కాలంలో తెలుగురాష్ట్రాలలో ఔత్సాహిక రైతులు వాణిజ్య పంటగా డేట్స్‌ను పండిస్తూ ప్రయోగాలు చేస్తున్నారు.

## పేరొందిన రకాలు

సాంప్రదాయ రకానికి చెందినవి 'మబ్రూమ్' రకం డేట్స్ లేత ఎరుపు నుంచి ముదురు రాగిరంగులో ఉండే ఈ రకం డేట్స్‌లో కండ ఎక్కువ. మృదువుగా ఉంటాయి. ఏదో చిక్లెట్‌ని నోట్లో వేసుకున్న ఫీలింగ్ కలుగుతుంది. సీజన్ కంటే కాస్త ముందుగానే పక్వానికి వస్తాయి.



## డెగ్లెట్ నూర్

అమెరికాలో బాగా ప్రసిద్ధిచెందిన ఖర్జూరరకం. తియ్యగా, మెత్తగా ఉండే ఈ ఖర్జూర పండు మధ్యలో డార్క్‌బ్రౌన్‌లో ఉండి ఆకర్షణీయంగా కనిపిస్తుంది. మీడియా నుంచి ఓ మోస్తరు సైజు వరకూ పెరుగుతాయి. వంటకాల్ల ఈ రకాన్ని ఎక్కువగా వినియోగిస్తారు.

## రుచికర ఐస్‌క్రీమ్‌లు

అసలే ఎండాకాలం..పిల్లలు ఐస్‌క్రీమ్ అంటూ పోరుపెడుతూనే ఉంటారు. కానీ చక్కెర మంచిది కాదని వారిస్తూ వస్తారు తల్లులు. అయితే ఆరోగ్యం గురించి ఆలోచించే వాళ్ల కాస్త వెరైటీగా డేట్ సిరప్‌తో ఐస్‌క్రీమ్ ట్రై చేయొచ్చు. చక్కెర, తేనెలకు బదులుగా ఐస్‌క్రీముల్లో డేట్ సిరప్‌ని వాడొచ్చు. ఇది ఐస్‌క్రీమ్ మృదుత్వాన్ని పెంచుతుంది. నోట్లో వేసుకోగానే కరిగేలా చేస్తుంది.

మరింత మృదుత్వాన్ని కోరుకునేవారు డేట్ సిరప్ కాస్త ఎక్కువ మోతాదులో కూడా ఉపయోగించొచ్చు. ఈ ఐస్‌క్రీమ్‌ల రుచి అమోఘం. పైగా క్యాలరీలు తక్కువ. పోషకాలు ఎక్కువ కాబట్టి ఆరోగ్యానికి మంచివే. అయితే ఎదైనా అతిగా వాడకూడదన్నది మాత్రం మరచిపోరాదు. ❑





## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి.

రచనలు పంపించాల్సిన చిరునామా: **ఎడిటర్,**
**ఆదివారం వార్త**, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

కథ

# పెళ్లిసందడి

దాసరి శివకుమారి

**"తాతగారూ! మీరూ, బామ్మా ఇలా ఈ కుర్చీల్లో కూర్చోండి. మనం లగ్నపత్రిక రాసుకోవటానికి వెళ్లేటప్పుడు తీసుకెళ్లాల్సిన కానుకలన్నీ ముత్తైదువలు ఈ సూట్‌కేసులో సర్దుతారు. మేం ఆంధ్రా నుంచి కేరళ వెళ్లిపోయి చాలా ఏళ్లు గడిచినా పెళ్లిళ్లకు పోతూ, పెళ్లి కూతురుకు తీసుకెళ్లి జరపాల్సిన ప్రధానం సంగతులన్నీ మాకు బాగానే గుర్తున్నాయి.**

అప్పట్లో మా అమ్మాయిని కూడా మన ప్రాంతం వాళ్లకే కొట్టాయం దగ్గరున్న రామాపురంలో ఇచ్చాం. తన పెళ్లి అంతా మన పద్ధతిలోనే చేశాం. మేం పల్లికతోడు అనే వూళ్లో వుంటున్నా ఇంట్లో అంతా ఆంధ్రా మాదిరే" అన్నది బామ్మగారు తల అటూ ఇటూ తిప్పి అందర్నీ కలియజూస్తూ".

"మా ముసలమ్మకు ఏం తెలుసుగానీ నేను చెపుతాను. మా అన్నదమ్ముల పెళ్లిళ్లకు, మా అమ్మ ఆ రోజుల్లోనే పెళ్లికూతురు కోసం పసుపూ, కుంకాలతో పాటు బట్టలూ, బెల్లం, ఎండుకొబ్బరి, ఖర్జూరాలు, జాపత్రి, జాజికాయ, యాలకులు, లవంగాలు లన్నీ పొట్లాలు కట్టి, పెట్టించేది.

పెళ్లికూతురు అవన్నీ తిని మొగుడితో చక్కంగ కాపురం చేసి, మంచిగా బిడ్డల్ని కనాలని. మీ బామ్మ అవన్నీ తిని శుద్ధంగా కాపురం చేసి నలుగురు బిడ్డల్ని కన్నది" అన్నారు తాతగారు మీసాలు సవరించుకుంటూ.

ఆ మాటలకు అక్కడున్నవారు నవ్వితే బామ్మగారు మొగుడి వంక కాస్త కోపంగా చూస్తూ బోలెడు సిగ్గుపడ్డారు.

"మేం కొట్టాయం నుంచి తెచ్చిన ఏలకులు, జాపత్రీ, జాజికాయలు, లవంగాలు అన్నీ శుద్ధమైనవి. ఇప్పుడు వాటిలో కొన్ని పెళ్లికూతురు కూడా ప్రత్యేకంగా పంపండి. అవన్నీ తిని, ఒంటికి పట్టించుకుని, మా మనవడితో మంచిగా కాపురం చేయాలని చెప్పండి. మా చిన్నకోడలు ఇక్కడికొచ్చి తన కొడుకు పెళ్లి ఆంధ్రాలో చేయాలని ముచ్చట పడింది. ఎలాగూ పెళ్లికూతురు ఇక్కడి అమ్మాయే. పైపెచ్చు తన మేనకోడలు. బంధువులంతా ఇక్కడే ఉన్నారు. దాంతో మేమంతా ముందుగా వచ్చి ఈ ఇల్లు తీసుకున్నాం. పెళ్లికూతురు వాళ్లకు దగ్గర్లోనే వుండి కలిసి మెలిసి పనులు చూసుకుంటున్నాం. ఇక్కడంతా సదుపాయంగా బాగానే వుంది" అంటూ తాతగారు వివరణ ఇచ్చారు.

తాతగారి మాటలకు ముత్తైదువలంతా నవ్వుకుంటూ లగ్నపత్రిక రోజుకి తీసుకెళ్లాల్సిన కానుకలన్నీ పెళ్లికూతురుకు ఇచ్చే పెట్టెలో సర్దేశారు.

....................

తాత గారికి, బామ్మ గారికి సదుపాయంగా వుండాలని వాళ్లకోసం ఈరోజు ఒక చిన్న గదిని కేటాయించారు. వాళ్లను ఎప్పుడూ ఎవరో ఒకరు కనిపెట్టుకుని చూస్తున్నారు.

"తాతగారూ! ఈ ఇంట్లోని బాత్‌రూమ్‌లో కూడా అంతా మార్బుల్‌తో వేసిన గచ్చు. కాస్త జాగ్రత్తగా వెళ్లి స్నానమదీ చేసి రండి" అని చెప్పారు.


"మాలాంటి వాళ్లు కాళ్లు జారి పడటానికి కాకపోతే ఎందుకొచ్చిన గచ్చులు ఇవి? తడి తగిలే చోట కాళ్లకింద గరుకుగా వుండేటట్లు చూసుకోవద్దూ. అయినా నేను బాగానే నిలదొక్కుకోగలను. మా ముసలమ్మ లాంటి వాళ్ల సంగతేంటి?" అంటూ స్నానానికెళ్లారు.

తిరిగి వచ్చి "ఇదుగో ముసలమ్మా! బాత్‌రూమ్‌లో కాస్త తడి ఆరనివ్వు. అయినా ఫ్యాన్ వేసి వచ్చాలే. ఆరినాకనే నువ్వు లోపలికి వెళ్లు. నువ్వు రెంటికీ వెళ్లాల్సి వస్తే కడుక్కోవటానికి చెంబూ, బొక్కెన అంటూ దేవులాడకు. చేతికి అందుబాటులో చిన్న జల్లుపైపు వున్నది. వేళ్లతో నొక్కిపట్టుకుంటే చిల్లుల్లో నుంచి నీళ్లు వస్తాయి, కడుక్కోవచ్చు. జాగ్రత్త. స్నానం చేసేటప్పుడు ఎర్రగుండీ గుర్తు వున్న పైపు తిప్పితే వేడినీళ్లు, నీలం రంగు గుండీ గుర్తు వున్న పైపు తిప్పితే చన్నీళ్లు వస్తున్నాయి. ఈ రెంటికీ పైనున్న పైపు తిప్పితే నీళ్లు జల్లుల్లా పడుతున్నాయి. అది తిప్పేసరికి నీళ్లు పడి నా తల కాస్తా తడిచిపోయింది. నువ్వు పొరపాటు పడి తిప్పి నీ కొప్పు తడుపుకోబాకు. అవన్నీ చూపించటానికి నేను తోడు రానా?" అన్నారు.

"పోవయ్యా! నాకామాత్రం తెలుసుద్దిలే" అంటూ బామ్మగారు సిగ్గుతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

"తాతగారూ! మీరెప్పుడూ ఇలాగే బామ్మగారిని ఆటపట్టిస్తూ వుంటారా?" ఓ పడుచు పిల్లకు సందేహమొచ్చింది.

"మనకుండే బాధలు, కష్టాలు ఎలాగూ తప్పవమ్మా.



కూస్తంత నవ్వుతూ మాట్లాడితే మనకూ సంతోషంగా వుండది. వినేవాళ్లకూ కులాసాగానే వుంటది. నేను పనిచేసిన రబ్బరు తోటల్లో కూడా పనివాళ్లను ఇలాగే నవ్విస్తూ మాట్లాడేవాడిని".

"నీకు తెలుగుతో పాటు మలయాళం కూడా బాగా వచ్చేదా తాతగారూ" అంటూ ఓ కుర్రాడు అనుమానంగా అడిగాడు.

"తెలుగు, మలయాళం కలిపి మాట్లాడేవాడేమోరా!" అన్నాడు మరో కుర్రాడు వేళాకోళంగా.

"ఒరేయ్ అబ్బాయ్! ఈ తాతను అంత తక్కువ అంచనా వెయ్యొద్దు. మేం బతకటానికి ఇక్కడి నుండి కేరళలోని కొట్టాయం జిల్లా వెళ్లాం.

అక్కడున్న పల్లికతోడు గ్రామంలో రబ్బరుతోటలు ఎక్కువగా ఉంటాయి. ఆ రబ్బరు తోటలో రబ్బరు చెట్ల నుండి పాలు తీసేపనికి కుదురుకున్నాను. బాగా ఏపుగా పెరిగి ముదిరిన రబ్బరు చెట్ల కాండానికి గాటు పెట్టి నేర్పుగా పాలు తీసే పనిలో మొనగాడినయ్యాను. ఆ తర్వాత కూలిపని నుండి మేస్త్రీనయ్యాను. ఇప్పుడంటే రబ్బరుపాలు తియ్యడానికి మిషన్లు వచ్చాయి. మా కాలంలో అక్కడ పనివాళ్లకు పనులు బాగానే దొరికేవి. అలా పనులు చేసేటప్పుడే మలయాళం కూడా నేర్చుకున్నాను.

నేనూ అంచెలంచెలుగా ఎదిగాను. మా కొట్టాయం జిల్లాలో దాదాపు అందరూ చదువుకునేవారు. దాంతో నా నలుగురు పిల్లలూ అంతో ఇంతో చదువుకున్నారు. నా కొడుకులిద్దరూ ఉద్యోగస్తులయ్యారు. నా కూతుళ్లిద్దరూ వాళ్ల ఇల్లు చక్కబెట్టుకుంటున్నారు. ఇదుగో ఇప్పుడు నేనూ మా ముసలమ్మ అక్కడే పల్లికతోడులోనే ఇల్లు కట్టుకుని ఉండిపోయాం. మీరంతా ఒకసారి అటు రండి, కేరళ చూసొద్దురుగానీ" అంటూ తాతగారు వాళ్లను పిలిచారు.

...

లగ్నపత్రిక వేడుక పూర్తయింది. మరో వారంలోనే పెళ్లిముహూర్తం కూడా కుదిరింది. అన్నిపనులూ హడావుడిగా చెయ్యాలనుకున్నారు. పెళ్లికొడుకును చేయటం, మెహందీ, సంగీత్ అంటూ రోజుకో రకం కార్యక్రమం సరదాగా పెట్టుకోవాలనుకున్నారు.

ఆరోజు పెళ్లికొడుకును చేసే కార్యక్రమం పూజతో మొదలయ్యింది.

"పంతులుగారూ! కడుపులో ఎత్తు లేదా ఏంది? కాఫీనీళ్లు కూడా తాగినట్లు లేరు. అలా కీచుగా మంత్రాలు చదువుతు న్నారు? బొత్తిగా వినపడ్డంలేదు. అరేయ్! ఏలక్కాయా, మిరియంగింజల పొడి కలిపి, బెల్లం వేసిన పాలను ఓ గ్లాసెడు తెచ్చి పంతులుగారికి ఇవ్వండిరా. ఆయనక్కాస్త ఊపిరొస్తుంది. ఆయన లేచొచ్చి పాలు తాగేటపుడు రెండో ఆయన పూజ చేయిస్తారులే" అన్నారు తాతగారు.

"ఊరుకోండి తాతగారూ! పూజ అయ్యేంతవరకు మధ్యలో లేచి ఏం తాగను. ఇవాళ తెల్లవారురుఝామున ఒక పెళ్లి చేయించాను. ఆదరా బాదరాగా స్నానమదీ చేసి ఇటు పడి వచ్చాను. దాంతో నిద్ర చాలక గొంతు కాస్త పీలగా అనిపించి వుంటుంది" అంటూ పక్కన కూర్చున్న తోటి బ్రాహ్మణునితో–

"అన్నయ్యా! నువ్వా అందుకో" అంటూ– "లక్ష్మీం క్షీర సముద్రరాజ తనయా" అంటూ మంత్రాలు గట్టిగా మొదలుపెట్టాడు.

లక్ష్మీగణపతి పూజ పూర్తయింది.

ఆ తర్వాత పెళ్లికొడుకును సోఫాలో కూర్చోబెట్టారు. సోఫాకు వెనగ్గా అంతా పూల అలంకరణ.

పెళ్లికొడుకు పక్కన తోటి పెళ్లికొడుకు వచ్చి కూర్చున్నాడు. ఆ అబ్బాయి తెగ సిగ్గుపడుతున్నాడు. మెలికలు తిరిగిపోతున్నాడు.

"నీకు తెలుగుతో పాటు మాలయాళం కూడా బాగా వచ్చేదా తాతగారూ" అంటూ ఓ కుర్రాడు అనుమానంగా అడిగాడు.

"తెలుగు, మలయాళం కలిపి మాట్లాడేవాడేమోరా!" అన్నాడు మరో కుర్రాడు వేళాకోళంగా.

"అరేయ్ కుర్రోడా! సిగ్గుపడమాకు. నేను డెబ్బై ఏళ్లవాడినే అయినా ఏడేళ్ల వాడితో సమానమే. నువ్వు సోఫాలో కుదురుగా లేకపోతే నా మనవడి పక్కన నేనే తోటి పెళ్లికొడుగ్గా కూర్చోవాల్సి వస్తుంది. ఆ నలుగేదో నేనే పెట్టించుకుంటాను. అసలే నువ్వు కాస్త నల్లగా పాతపడీ పడని చింతపండులాగా వున్నావు. నలుగు పెట్టించుకుంటేనన్నా కాస్త నలుగు తగ్గుతుంది. ఆ పైన నీ ఇష్టం" అంటూ తాతగారు హాస్యమాడారు.

ఆ మాటల్తో తోటి పెళ్లికొడుకు మరింత సిగ్గుపడ్డాడు.

"నీ మాటల్తో ఆ కుర్రాడిని మరీ బెదరగొట్టబాకయ్యా" అన్నది బామ్మగారు.

"నేను కుర్రాడినై మళ్లీ పెళ్లికొడుకునవు తానేమోనని నీకు భయం పట్టుకున్నది లాగున్నది ముసలమ్మా. భయపడమాకు" అన్నారు తాతగారు తన మీసాలు సవరించుకుంటూ.

"ఛ.. నిన్ను కదిలించటం నాదే పొరపాటు" అంటూ బామ్మగారు నవ్వు దాచుకుంటూ వెళ్లిపోయారు.

ఒక్కొక్కరూ వచ్చి పెళ్లికొడుక్కూ, తోటి పెళ్లికొడుక్కూ తలకు నూనె పెట్టి, ముఖాన బొట్టు పెట్టి, మెడకు గంధం రాసి, చెంపలకూ, చేతులకూ సున్నిపిండి రాస్తున్నారు. వరసైనవారు ముఖమంతా సున్నిపిండి పామేస్తున్నారు.

"గుళ్లో ఆంజనేయస్వామి ముఖానికి మెత్తినట్లు మెత్తండి" అన్నారు తాతగారు.

"ఏం తాతగారూ! ఈ వయసులోనే మీరింత హుషారుగా వున్నారు. వయసులో వుండగా ఇంకెంత చలాకీగా వుండేవారో!" అంటూ పంతులుగారు తీరిగా తాతగారితో కబుర్లలో పడ్డారు.

"మరేమనుకున్నారు పంతులుగారూ! ఇప్పుడైనా నాకు కట్నమిచ్చి మరీ పిల్లనిస్తారు. ముసలమ్మ ఏడ్చిపోద్దని ఆగుతున్నానుగానీ లేకపోతేనా?" అంటూ మరోసారి మీసాలు సవరించుకున్నారు.

"మళ్లీ పెళ్లి. పైగా ఎదురు కట్నమిచ్చి మరీ. ఏం మాటలు చెప్తున్నారండీ? సరే. మీరెక్కడైనా, ఎప్పుడైనా పెళ్లి చేసుకుంటే నాకు కబురు పెట్టండి. వచ్చి పెళ్లి చేయిస్తాను. నాకు డబ్బులేమీ వద్దు. నేనే చార్జీలు పెట్టుకుని మరీ వస్తాను. పోనీ ఒక పని చేయండి. మామ్మగార్ని బాధపెట్టి మళ్లీ పెళ్లేం చేసుకుంటారుగానీ, ఓ పదేళ్లాగితే సహస్ర చంద్ర దర్శనాన్ని పూర్తి చేసుకున్నవారవు తారు. బ్రహ్మాండంగా ఆ వేడుక చేసుకుందురు" అని తాతగారితో మాట్లాడుతుంటే పంతులుగారికి కూడా నీరసం, బద్ధకం పోయి ఉత్సాహమొచ్చింది.

అబ్బాయి పెళ్లి అయితేనేం? మా బంధువులకూ, పేరంటాళ్లకూ పెట్టించాల్సిందే!

అనేటప్పటికి బ్యూటీపార్లర్ నుండి గోరింటాకు డిజైన్లు పెట్టేవారిని పిలిపించారు. డిజైనర్స్ డిజైన్లున్న పుస్తకాలను చూపించారు. మీ చేతులకు ఈ డిజైను, మా చేతులకీ డిజైన్ అంటూ అక్కడివారంతా పోటీ పడసాగారు.

"నువ్వూ గోరింటాకు పెట్టించుకో ముసలమ్మా. చేతులు ఎట్లా పండుతాయో చూద్దాం. నువ్వెప్పుడూ బండగా చుక్కలు పెట్టి చెయ్యంతా పాముకుంటావు. వీళ్ల సన్నటి లతలు వేస్తున్నారు".

"అబ్బ.. ఈ తాతగారు ఎప్పుడూ బామ్మగార్ని ఏడిపించే పనిలోనే వుంటారు. పాపం.. ఆమె ఏమీ మాట్లాడదు" అన్నదొకామె తన చేతి గోరింటాకును ఊదుకుంటూ.

మామయ్యగారి మాటలకు అత్తయ్య ముసిముసిగా నవ్వుకుంటూ కోపం తెచ్చుకోవటం.. ఇవన్నీ మాకలవాటే" అన్నది వాళ్ల కోడలు.

ఆరోజు 'సంగీత్' అంటూ వచ్చిన బంధువులు తలా ఒక పాట పాడుతూ, కొంత మంది పాటకు తగ్గట్టుగా డ్యాన్సు చేస్తున్నారు.

అదంతా చూస్తున్న తాతగారు ఊరికినే వుంటారా?

"నువ్వూ వస్తావా ముసలమ్మా? ఇద్దరం రెండు పిల్లిగంతులో, కోతిగంతులో వేద్దాం"

"చాల్లే ఊరుకోవయ్యా. నీ నోటికి మరీ హద్దూ పద్దూ లేకుండా పోతున్నది. చుట్టాలంతా యేమైనా అనుకుంటారైనా లేదు. నీ వయసేంటి? నీ మాటలేంటి? పందిట్లో కూర్చుని మగాళ్లతో ముచ్చట్లు చెప్పుకోక నా ఊసెందుకు?" అన్నది కోపంగా.

ఇక లాభం లేదు. ముసలమ్మ గారికి నిజంగా కోపం వస్తే ఒక పట్టాన తగ్గదు. నేనే పోయి రెండు గంతులు వేస్తా" అంటూ ముందుకు వెళ్లారు.

కుర్చీ ఒకటి కాళ్లకు తగిలింది. ముందుకు తూలిన మనిషికి పంచె కూడా కాళ్లకడ్డుపడింది. తమాయించుకోలేక ముందుకు పడ్డారు.

అందరికన్నా ముందు బామ్మగారు తేరుకుని చెయ్యందించి లేపి నిలబెట్టారు.

"అందుకేనే ముసలమ్మా, నేనింతగా నిన్ను అంటిపెట్టుకుని వుండేది. నువ్వొచ్చి లేవదీస్తావనే నేను ముందుకు తూలిపడ్డాను. తెలుసా?" అన్నారు బుకాయింపుగా.

అందరూ నవ్వారు.

మనుమడి పెళ్లిరోజు రానే వచ్చింది. ఆరోజు కూడా మరలా పెళ్లికూతురుకు కానుకగా ఇవ్వటానికి తాళిబొట్టు, నల్లపూసలు, చీరలు, రవికెలు ఇలా.. కావలసినవన్నీ ప్రధానం పెట్టెలో సర్దుతున్నారు.

"మన కొట్టాయంలోని సురభి బట్టల దుకాణంలో కొన్ని పట్టుచీరల్ని అందరికీ చూపించండి. అవెంత నాణ్యమైనవో ఇక్కడందరూ చూస్తారు. మా ముసలమ్మక్కూడా రెండు పట్టుచీరలు కొన్నారుగా. ముసలమ్మ నా అంత అందంగా వుండదు. ఆ చీరల్లోనన్నా కాస్త మెరుపుగా వుంటుందేమో చూద్దామనుకుంటున్నాను" అన్నారు తాతగారు తన సహజ ధోరణిలో.

> "నువ్వూ గోరింటాకు పెట్టించుకో ముసలమ్మా. చేతులు ఎట్లా పండుతాయో చూద్దాం. నువ్వెప్పుడూ బండగా చుక్కలు పెట్టి చెయ్యంతా పాముకుంటావు. వీళ్ల సన్నటి లతలు వేస్తున్నారు" అన్నారు తాతగారు.

కేరళ అబ్బాయి, ఆంధ్రా అమ్మాయి పెళ్లి తాతగారి చెణుకుల మధ్య సందడిగా జరిగింది. ●

## జోక్స్ కార్నర్

### అంతేనా?

ప్రసన్న: నిన్న మా చిన్నపాప గుండుసూది మింగేసింది.

అంబిక: అంతేనా? మొన్న మా ఆయన అగరుబత్తి స్టాండ్ మింగేసారు.

ప్రసన్న: అమ్మో! ప్రమాదమేమీ లేదుగా!

అంబిక: ఏంలేదుగానీ మేం అరటిపండు మీద అగరుబత్తి గుచ్చుతాం.

### ఏ, బి, సి, డిలు చదవాలి!

నివాస్: తాతయ్యా! ఎందుకు ఏ, బి, సి,డిలు చదువుతున్నావు?

తాతయ్య: రేపు కంటి డాక్టర్ దగ్గరకు వెళ్లాలి, ఆయన ఏ, బి, సి, డిలు చదవమంటాడు.

### ఆయన వండాలి కదా!

విజయ: ఎంత ఆలస్యమైనా మా ఆయన వచ్చాకే ఏదైనా తింటాను.

రజని: అబ్బో! మీ ఆయనంటే అంత ప్రేమా?

విజయ: ఆయన వచ్చి వంట చేస్తేనే కదా నేను తినేది.

### నాకైనా దక్కింది

పరాకు పరమేశం: నిన్ను పెళ్లి చేసుకునే బదులు ఓ గాడిదని చేసుకోవాల్సింది.

కత్తికాంతమ్మ: పోనీలెండి.. మీకు దొరకని అదృష్టం నాకు దక్కింది.

### డాడీ కూడా!

విజయ: పింకీ! ఎందుకు ఏడుస్తున్నావు?

పింకీ: మమ్మీ కొట్టారు.

విజయ: ఓస్! అంతేనా? డాడీకి చెప్పు.

పింకీ:డాడీ పక్క గదిలో ఏడుస్తున్నారు.

– ఈ.ఎస్.మాధవన్

## సరదా రచనలకు ఆహ్వానం

జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి.
మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080. sunmagvaartha@gmail.com

# పల్లె తెలంగాణ నోట రక్తాశ్రువుల 'పాట'




**తెలంగాణ పల్లెగొంతుక పాటతో పరవశిస్తోంది. తెలంగాణ గుండెచప్పుడైన పాట ధూం ధాం దరువుల్లో ఉద్యమానికైనా, తిరుగుబాటుకైనా ఊపిరి పోస్తుంది. కాళ్లకు గజ్జె కట్టి డప్పు చేత పట్టి, చిన్న పంచకట్టు గొంగడి పెద్ద దస్తీతో, వేదికలపై కదం తొక్కుతుంది.**

శ్రమశక్తి దోపిడీ అయినా, రాజ్యాధికారం సృష్టించే హింసా అణచివేతలైనా, వస్తువేదైనా తెలంగాణ గొంతు విప్పితే సామాన్యుల కష్టాలు, కన్నీళ్లు, త్యాగాలు, ఆశలు, అడియాసలు పాటలలో ప్రతిధ్వనిస్తాయి. బహుశా భారతీయ సాహిత్యంలో జనం నోళ్లలోంచి వారి కాంక్షలకు, ఆశలకు, కలల రూపంగా పాట యింతగా జనాన్ని కదిలించగలగటం ఒక్క తెలంగాణ సీమకే చెల్లిందనిపిస్తుంది. ఒకప్పుడు, కఠిన పాషాణాలైన జైలుగోడల మీద రాసిన పాటలు, జనహృదయాలను తల్లడిల్లచేసాయి. గోల్కొండ బందిఖానాలో భక్తరామదాసు వేదనాయుత వేడుకోళ్లు, మహాకవి దాశరథీ 'తీగెలను తెంపి అగ్నిలో దింపినావు' వంటి వ్యక్తీకరణలు కవిగుండె గాయపడి పల్లవించినవే. అర్ధ శతాబ్ది పైగా రైతాంగ పోరాటాల అగ్నిగోళాలు, నమ్మిన రాజకీయ సిద్ధాంతాల కోసం గళం విప్పిన తెలంగాణ పాట రక్తాశ్రువులు వర్షింపచేసింది. కలాలు ఝుళిపించి, గళాలు విప్పిన విప్లవ గాయక రచయితలు ఎందరో అమరులయ్యారు. తెలంగాణ సమాజ నిర్మాణంలో దశాబ్దాల కాలగమనంలో ఎన్నో పోరాటాలు, తిరుగుబాట్లు, సంఘర్షణలు, ఎన్నో పోరుబాటలలో, 'పాట' చరిత్ర సృష్టించింది. ఇక రాష్ట్ర సాధన కోసం గాయకులు, కళాకారులు, రచయితలు పాట ద్వారా అగ్ని రగుల్కొల్పారు. ప్రత్యేక రాష్ట్రం అవతరింపచేసారు.

తెలంగాణ పాట కాల్మొక్కని తూటాగా దూసుకుపోతుంది. లేత గొంతుకల యువతీ యువకులు పాట కోసం తిరుగుబాటు బావుటా ఎగురవేసి పోరుబాటలో ఆఖరి ఊపిరిగా కనుమరుగయ్యారు. కమ్యూనిజం అరుణోదయం, అరసం, విరసం ఏ సంఘమైనా పాట ఆయుధ శక్తిగా ప్రభవించింది. ఎందరో యువ కళాకారులు అయిన యువతులు కళాకారిణిలుగా అజ్ఞాతంగా నిష్క్రమించారు. విషాద స్మృతులు మిగిల్చారు.

ప్రజా యుద్ధనౌక గద్దర్ 'సిరిమల్లె చెట్టుకింద అచ్చుమమ్మో', గూడ అంజయ్య 'ఊరు మనదిరా', సుద్దాల అశోక్‌తేజ 'నేలమ్మా నేలమ్మా', జయరాజ్ 'వానమ్మా వానమ్మా', అందెశ్రీ 'మాయమైపోతున్నాడమ్మా', గోరటి వెంకన్న గుర్తుకు వస్తే 'పల్లె కన్నీరు పెడుతుందో' తెలంగాణ పల్లెల హృదయాలను కదిలించాయి. పల్లె బతుకులలోని నుడికారం, సామెతలు, నానుడులు, పదజాలం పాట, పల్లెల గడపదాటి తెలుగు సాహిత్యంలో ప్రధాన ప్రక్రియగా ప్రభావితం చేస్తోంది. సాహిత్య ప్రస్థానంలో కొత్త ధోరణులకు పాట బాటలు వేసింది.

విప్లవకవి శివసాగర్ 'నరుడో భాస్కరుడా' పాట తెలంగాణ పల్లెల్లో కోలాటంలో పాడుకొనేవారు. చెరబండ రాజు, గద్దర్ పాటలు తెలుగు సాహిత్యాన్ని మలుపు తిప్పాయి. సుద్దాల హనుమంతు ఆశువుగా పాటలు రాజకీయ, సాంస్కృతిక, జీవనానికి ఆనవాళ్లుగా నిలిచాయి. పర్యావరణ, ప్రపంచీకరణ, వర్తమాన సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అద్దం పట్టే పాటలెన్నో వచ్చాయి. శ్రమజీవుల చెమట బిందువుల నుండి పుట్టిన పాటలలో శ్రమజీవుల వ్యథలున్నాయి. గూడ అంజయ్య 'ఊరు మనదిరా.. ఈ వాడ మనదిరా' అనే పాట 16 భాషలలోకి అనువాదమై ఖండాంతరాలకు చేరింది.

తెలుగు సాహిత్యంలో తెలంగాణ పాటకు విశిష్ట స్థానం వుంది. అణచివేత, రాజ్యాహింస, దుర్వ్యవస్థ మీద తిరుగుబాటు జనాగ్రహానికి బావుటాగా వివిధ కళారూపాలలో 'పాట' ఉద్యమకారులకు ఆయుధం అయింది. మూగపోయిన, విషాద తెలంగాణకు మళ్లీ గొంతు వచ్చింది. సుద్దాల హనుమంతు 'పల్లెటూరి పిలగాడా', యాదగిరి 'బండెన్క బండిగట్టి', గద్దర్ 'ఆపుర రిక్షోడ, రిక్షెంట నేనొస్త', 'లాల్ సలామ్ లాల్ సలామ్', 'గ్యాంగోల్లమండి మేము బాబు' ఇట్లాంటి పాటల ద్వారా జనసామాన్యానికి విప్లవ భావజాలాన్ని సూటిగా ప్రచారం చేసాయి. కవిగా యువకులెందరో కార్చిచ్చు రగిలించారు.

తెలుగు సమాజంలో శతాబ్దాలుగా అన్నమయ్య, రామదాసు, త్యాగరాజు వందలాది వాగ్గేయకారులు, వేమన, పోతులూరి వీరబ్రహ్మం వంటి ప్రబోధకులు జనంతో మమేకమవుతూనే వున్నారు. క్రమేపీ ఊపిరికి ఊపిరికి అందించే పోరుబాటల ప్రస్థానంలో పాట కళాకారులు, గాయకులు వేదికలపై గజ్జె కట్టారు. ఉద్యమోన్ముఖం, యుద్ధోన్ముఖం అయింది. కష్టజీవుల దోపిడీ వ్యవస్థపై నిరుపేద రైతులు, కూలీలు యితర శ్రామికుల పక్షాన ప్రజా, జన నాట్యమండలి కళాకారులు మౌఖిక రూపంలో పాటకు అగ్రస్థానం యిచ్చారు. ఘర్షణ పోరాటాల క్రమంలో కొత్త సంస్కృతి పుట్టింది. క్రమేపీ బతుకమ్మ పాటలు కూడా వెల్లివిరిసాయి.

తెలంగాణలో పాట, ఆట ద్వారా జన సామాన్యాన్ని కదిలించగల కవిగాయకులు ఎందరో వున్నారు. విమలక్క, గొడిశాల జయరాజ్, ఏపూరి సోమన్న, ఎల్లన్న, అంబటి వెంకన్న, సంతోష్, పసునూరి రవీందర్, అల్లం రాజయ్య, భూపాల్, హిమజ్వాల, అల్లం వీరయ్య, అభినయ, శ్రీనివాస్ యింకా ఎందరో అరుణోదయ సాంస్కృతిక కళాకారులు అజ్ఞాతంగా గుర్తింపుకు నోచుకోకుండా తెలంగాణ సీమలలో జ్వలించే కాగడాలుగా, దారి చూపే మణిదీపాలుగా గొంతు విప్పారు. నేటి నవ తెలంగాణలో చారిత్రక రాజకీయ నేపథ్య పరిణామాలలో పాట గొంతు కొంత స్వరం మార్చి సవరించుకొంటోంది.

**- జయసూర్య**

**వాస్తువార్త**
**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**
**డా॥ దంతూరి పండరినాథ్**
**3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్**
**సెల్: 9885446501/9885449458**



# మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకులు ఏ భాగంలో ఉండాలి?

మరుగుదొడ్లు నైరుతి, వాయువ్య, ఆగ్నేయ భాగాల్లో మాత్రమే నిర్మించాలి. ఇంటికి కాంపౌండు గోడలున్నప్పుడు ఇంటి బయట, కాంపౌండు గోడలకు మధ్యన వచ్చే నైరుతి, వాయువ్య, ఆగ్నేయ భాగాల్లో ఇలాంటి నిర్మాణాలు జరపాలి. ఒక్కో మూల మరుగుదొడ్ల నిర్మాణం ఒక్కో ప్రత్యేక పద్ధతిలో జరపాల్సి ఉంటుంది.

నుయ్యిలు, గొయ్యిలు వదలటం వలన ప్రాణానికి ముప్పు తెచ్చే ప్రమాదాలు జరుగుతాయి. సెప్టిక్ ట్యాంక్ కోసం అక్కడ గొయ్యి తవ్వినా వాస్తుదోషం వలన అలాంటి దుష్ఫలితాలలో మార్పు ఉండదు. గొయ్యి పైన వెడల్పు రాయితోగానీ, స్లాబుతోగానీ కప్పివేస్తాం కాబట్టి ఆ దుష్ఫలితాలు రావనుకోవటం పొరపాటే అవుతుంది.

ఇంటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తాకకూడదు. మరుగుదొడ్డికి, ఇంటికీ మధ్య కనీసం ఒక మనిషి నడవగలిగినంత ఖాళీ స్థలాన్ని విధిగా

## నైరుతిమూల

నైరుతి మూలలో మరుగుదొడ్లు నిర్మించవలసి వచ్చినప్పుడు పశ్చిమ దక్షిణ ప్రహరీ గోడలను ఆనుకొని మరుగుదొడ్డి నిర్మించాలి. అయితే అది ఇంటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదు. పైన సిమెంటు రేకులు వేసినా, జింక్‌షీట్స్ వేసినా అవి తూర్పు లేదా ఉత్తరంవాలు వచ్చే విధంగా చూసుకోవాలి. కాంక్రీట్ స్లాబు వేస్తే అది ఈశాన్య వాలుగా వచ్చేలా చూసుకోవాలి. వర్షంనీరు ఆ స్లాబుపై నుండి ఈశాన్యం వైపు జారే విధంగా ఒకటి రెండు



అంగుళాలు వాలుగా వుంటే చాలు. రేకులు వేసినప్పుడు మాత్రం ఉత్తరం లేదా తూర్పు వైపు ఒకటి రెండు అడుగులు వాలుగా వుండాలి.

వీలునుసరించి ఉత్తరం వైపుగానీ, తూర్పు వైపుగానీ తలుపును ఏర్పరచాలి.

సెప్టిక్ ట్యాంకుతో కూడుకున్న మరుగుదొడ్డిని నిర్మించవలసి వచ్చినప్పుడు నైరుతి మూలలో సెప్టిక్ ట్యాంక్ తవ్వి దానిపైన మరుగుదొడ్డి కట్టడం సాధారణంగా చేస్తుంటారు. అది సరైన పద్ధతి కాదు. నైరుతి భాగంలో

నైరుతిలో మరుగుదొడ్డి కట్టుకున్నప్పటికీ సెప్టిక్ ట్యాంక్ మాత్రం ఉత్తర కాంపౌండు గోడకు మధ్య భాగంలో లేదా తూర్పు కాంపౌండు గోడకు మధ్య భాగంలోనే నిర్మించుకోవాలి.

మరుగుదొడ్డి నుండి పైప్‌లైను ఆ సెప్టిక్ ట్యాంక్‌కి కలిపితే నైరుతిలో మరుగుదొడ్డి కట్టుకోవచ్చు. అటువంటప్పుడు మరుగుదొడ్డిలో 'లెట్రిన్ పాట్' కట్టుకోవచ్చు. నైరుతి భాగంలో కట్టే మరుగుదొడ్డిలో దక్షిణ ముఖంగా కూర్చోవటం వీలుపడకపోతే ఉత్తర ముఖంగా కూర్చోవచ్చు.

## వాయువ్య మూల

వాయువ్య మూలలో మరుగుదొడ్డిని నిర్మించవలసి వస్తే ఉత్తర వాయువ్యపు కాంపౌండు గోడను తాకకుండా పశ్చిమ వాయువ్య గోడనంటుకొనిగానీ, అంటకుండాగానీ నిర్మించవచ్చు.

పశ్చిమ గోడను పూర్తిగా కొలిచి తొమ్మిది సమ భాగాలుగా చేసి వాయువ్య మూల నుండి రెండు భాగాల మేరకు వదిలిపెట్టి పశ్చిమ గోడను ఆనుకొని లేదా కొంత ఖాళీ వదిలిగానీ మరుగుదొడ్డిని కట్టుకోవటం శ్రేష్ఠమయిన పని. వాయువ్య మూలలో అంత స్థలం వదలటం వీలు కాకపోతే కనీసం మూడు అడుగుల స్థలం వదిలి పశ్చిమ గోడను ఆనుకొని లేదా అంటకుండా కట్టుకోవాలి. ఆ మరుగుదొడ్డి

వదిలేయాల్సి ఉంటుంది.

సెప్టిక్ ట్యాంక్ పైన మరుగుదొడ్డి నిర్మించవలసి వస్తే వాయువ్యంలో సెప్టిక్ ట్యాంక్‌ని తవ్వకూడదు. సాధారణంగా యిలాగే కడుతూ వుంటారు. తర్వాత యిబ్బందుల పాలయ్యేబదులు మొదటే జాగ్రత్త పడటం మంచిది. సెప్టిక్ ట్యాంక్‌ని తూర్పు లేదా ఉత్తర కాంపౌండు గోడ మధ్య స్థలంలో నిర్మించి మరుగుదొడ్డి నుంచి పైప్‌లైన్‌ని సెప్టిక్ ట్యాంక్‌కి కలపాలి. వాయువ్య మూలలో కట్టిన మరుగుదొడ్డిలో దక్షిణ ముఖంగా కూర్చోవటానికి వీలుగా ఉంటుంది. అలాగే కూర్చోవటం శ్రేష్ఠం. తూర్పు, పశ్చిమ ముఖాలుగా కూర్చోవటం ఏ విధంగానూ మంచిది కాదు.

వాయువ్యంలో ఉత్తరపు గోడను ఆనుకొని మరుగుదొడ్డిని నిర్మించటం కోరి కష్టాలను తెచ్చుకోవటమే అవుతుంది. ఒకవేళ యింటికి తూర్పు ఈశాన్యంలో గేటు వుంటే ఆ గేటుకు ఎదురుగా వాయువ్య మూలన మరుగుదొడ్లను నిర్మించే ఆలోచన మానుకుంటే మంచిది.

ఇల్లు దక్షిణ ముఖ ద్వారమయినప్పుడు దక్షిణం, దక్షిణ ఆగ్నేయాల వైపు గేట్లు వుంటాయి. కనుక వాయువ్య మూలలో పైన చెప్పిన మరుగుదొడ్లను నిర్మించుకోవచ్చు. అదే తూర్పు ముఖ ద్వార గృహమయినప్పుడు తూర్పు, తూర్పు ఈశాన్యాల వైపు గేట్లు వుంటాయి కాబట్టి వాయువ్యంలో మరుగుదొడ్డి నిర్మించుకోవటం(తూర్పు ఈశాన్యం గేటు వున్నప్పుడు మాత్రమే) సరైన మంచి ఫలితాలు యివ్వదు. ఆ మరుగుదొడ్డిలో తూర్పు మొఖంగా కూర్చునేట్లు ఏర్పాటు వుంటే దుష్ఫలితాలు విరివిగా వుంటాయన్నది సత్యదూరం కాదు. ■

# అతి శీతల ఖండం.. అంటార్కిటికా

దక్షిణార్ధ గోళంలో 'అంటార్కిటిక్' వలయం లోపల దక్షిణ ధృవాన్ని ఆవరించి ఉన్న విశాల ప్రదేశాన్ని 'అంటార్కిటికా' ఖండం అని పిలుస్తారు. ఇదో మంచు సామ్రాజ్యం. ఇది ప్రపంచంలోనే అయిదో పెద్ద ఖండం. సుమారుగా ఒక కోటి 42 లక్షల కి.మీ. విస్తీర్ణం కలిగిన గడ్డకట్టిన మంచు ఎడారి ఇది. అంటార్కిటికా అతి శీతల ఖండం. ఇక్కడ ఆగస్టు మాసాంతం చలికాలం కావడంతో ప్రపంచంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయి. అంటార్కిటికా తీర ప్రాంతాల్లో అతి తీవ్రమైన, దట్టమైన చలిగాలులు వీస్తాయి. వీటినే 'కెటబాలిక్' పవనాలు అంటారు. చలి ఎక్కువగా ఉండటం వల్ల ఇక్కడ ఐదు రకాల దుస్తులను పర్యాటకులు ధరిస్తుంటారు. వీటిని ఒకదానిపై మరొకటి తొడుక్కోవాలి. చలికోసం పొడవైన బూట్లు ధరించి నడవాలి. 3,050 కిలోమీటర్ల పొడవైన ట్రాన్స్ అంటార్కిటిక్ పర్వతాలు ఈ ఖండాన్ని తూర్పు అంటార్కిటికా ఖండం అంటేనే వింత ప్రపంచం. ప్రపంచంలోని శుద్ధ జలాలలో 70 శాతం మంచినీరు రాతి పర్వతాలను పోలిన మంచు గడ్డల రూపంలో ఇక్కడ ఉంది. అంటార్కిటికాలో కొన్ని ప్రదేశాలలో మంచుకొండలు సుమారు 4 కి.మీ. ఎత్తు వరకు ఉంటాయి. మంచు సామ్రాజ్యమైన అంటార్కిటికాలో కొన్ని ప్రాంతాలలో గత 20 లక్షల సంవత్సరాలలో ఒకసారి కూడా వర్షంకానీ, మంచుకానీ కురవలేదంటే ఆశ్చర్యం కలగక మానదు. అంటే అంటార్కిటికాలో కొన్ని పొడి ప్రదేశాలు కూడా ఉన్నాయన్నమాట.



షేక్ అబ్దుల్ హాకీం జాని

## అంటార్కిటికాలో అద్భుత సాహస యాత్ర

అంటార్కిటికా భూమికి దక్షిణాన ఉన్న ధ్రువ ఖండం. దీని విస్తీర్ణం కోటి నలభై రెండు లక్షల చ.కి.మీ. ఆసియా, ఆఫ్రికా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికాల తర్వాత ఐదవ అతి పెద్ద ఖండం అంటార్కిటికా. యూరప్, ఆస్ట్రేలియా దీనికంటే చిన్నవి. ఈ ఖండం 98 శాతం మంచుతో కప్పబడి ఉంటుంది. ప్రపంచం లోకెల్లా అతి చల్లని ప్రాంతం కావడం వల్ల ఇక్కడ ప్రజలు శాశ్వత నివాసాలను ఏర్పాటు చేసుకోలేరు. భూమ్మీద కనుక్కున్న చిట్టచివరి ప్రాంతం అంటార్కిటికా. 1820 వరకు దీని గురించి తెలియదు. రష్యన్ సాహసికులు ఫాబియన్ గొట్లియేబ్ వాన్ బెల్లింగ్సాసెన్, మిఖాయిల్ లాజరేవ్‌లు వోస్టేక్, మిర్నీలపై మొదలైనవారు చేసిన యాత్రలో ఫింబుల్ ఐసు పలకను కనుగొన్నారు. దాని ప్రతికూల వాతావరణం, సులభంగా అందుబాటులో ఉండే వనరులు లేకపోవడం, ఒంటరిగా ఉండటం ఇత్యాది కారణాల వల్ల ఈ ఖండం గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. 1895లో నార్వే దేశానికి చెందిన ఒక బృందం తొలిసారిగా అక్కడికి వెళ్లినట్లుగా నమోదైంది. ఇక్కడకు వెళ్లాలంటే అదో సాహస యాత్ర అనే చెప్పాలి. పర్యాటకులు వారం రోజుల పాటు ఈ ప్రాంతంలో తిరగాలంటే దాదాపు పది లక్షలకు పైగా డబ్బు ఖర్చు చేయవలసి ఉంటుంది.

## శాస్త్రీయ పరిశోధనలు

శాస్త్రవేత్తలకు సైతం అంతుపట్టని, అర్థంకాని ప్రదేశం అంటార్కిటికా. అనేకమంది శాస్త్రవేత్తలు ఇక్కడకు పరిశోధనల నిమిత్తం వస్తుంటారు. కొందరైతే ఈ ప్రాంతంలోనే సుదీర్ఘకాలం ఉండి తమ పరిశోధనలు కొనసాగిస్తుంటారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 'అంటార్కిటికా సంధి' అని పిలిచే అంతర్జాతీయ ఒడంబడిక ప్రకారం ఈ ఖండం రాబోయే 50 ఏళ్ల వరకు ప్రకృతి సాధించిన అతిపెద్ద సహజ పరిశోధనాగారంగా భావించడం జరిగింది. ఈ పరిశోధనాగారంలో భూగోళం శీతోష్ణస్థితి, అనేక ఇతర బహుళ ప్రయోజకర రంగాల్లో భారత్‌తో పాటు, ఇతర దేశాల శాస్త్రవేత్తలు పరస్పర సహకారంతో తమ శాస్త్రీయ పరిశోధనలను కొనసాగిస్తున్నారు.



1959లో అంటార్కిటిక్ ఒప్పందంపై పన్నెండు దేశాలు సంతకం చేశాయి. ఆ తరువాత ముప్పై ఎనిమిది దేశాల సంతకం చేశాయి. ఆ ఒప్పందాలకు అనుగుణంగానే ఇక్కడ కార్యకలాపాలు జరుగుతుంటాయి. సైనిక కార్యకలాపాలు, ఖనిజ తవ్వకాలను, అణు విస్ఫోటనాలు, అణు వ్యర్థాలను ఈ ప్రాంతంలో పారవేయడాన్ని ఈ ఒప్పందం నిషేధించింది. శాస్త్రీయ పరిశోధనలకు అనుమతిస్తారు. భారతదేశ శాస్త్రజ్ఞులు అంటార్కిటికాలో నివసించి పరిశోధనలు చేసేందుకు వీలుగా 'దక్షిణ గంగోత్రి', 'మైత్రి', 'భారతి' అనే మూడు పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అనేక ప్రభుత్వాలు ఖండంలో శాశ్వత మానవ సహిత పరిశోధన కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. ఈ ఖండంలోను, దాని సమీప ద్వీపాలలోనూ శాస్త్రీయ పరిశోధన, ఇతర పనులూ నిర్వహించే వారు. వారికి మద్దతు ఇచ్చే వారి సంఖ్య శీతాకాలంలో సుమారు 1,000 వరకు, వేసవిలో 5,000 వరకు ఉంటుంది. పలు దేశాలకు చెందిన ఈ శాస్త్రవేత్తలు ఇక్కడ ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. చాలా స్టేషన్లలో ఏడాది పొడవునా సిబ్బంది ఉంటారు. శీతాకాలపు సిబ్బంది సాధారణంగా తమ సొంత దేశాల నుండి ఒక సంవత్సరం పాటు పని చెయ్యడం కోసం వస్తారు. దక్షిణ ధ్రువ ప్రాంతంలో శాశ్వత మానవ నివాసం లేదు. మెక్‌ముర్డో స్టేషన్ అంటార్కిటికాలోని అతిపెద్ద పరిశోధనా కేంద్రం. దీన్ని అమెరికా నిర్వహిస్తుంది. పామర్ స్టేషన్, అముండ్సెన్-స్కాట్ సౌత్ పోల్ స్టేషన్ (అమెరికా), మరాంబియో బేస్(అర్జెంటీనా), స్కాట్ బేస్ (న్యూజి లాండ్), వోస్తోక్ స్టేషన్(రష్యా) ఇత్యాదివి ఇక్కడ నెలకొల్పిన ముఖ్యమైన స్టేషన్లు.

## ఖనిజ సంపద

ఈ ఖండంలో నేలబొగ్గు, రాక్ ఫాస్ఫేట్లతో పాటు యాంటిమోని, క్రోమియం, రాగి, బంగారం, గెలీనా, సీసం, లిబ్డినం, తగరం మొదలైన ఖనిజాలు




ఉన్నట్లు గుర్తించారు. ఇటీవల పరిశోధనల్లో అంటార్కిటికా మహాసముద్ర భూతలపై దక్షిణ పసిఫిక్, దక్షిణ అట్లాంటిక్ ప్రాంతాల్లో ఫెర్రో మాంగనీస్ గుళికలు ఉన్నట్లు కనుక్కున్నారు. ఈ ప్రాంతంలో ఖనిజాలను వెలికితీయరాదనే నియమం 1998 జనవరి 14 నుండి అమలులోకి వచ్చింది. అంటార్కిటికా ఒప్పందం ప్రకారం ఇక్కడ సైనిక కార్యకలాపాలను నిషేధించారు. సైనిక సిబ్బంది, పరికరాలు శాస్త్రీయ పరిశోధన, ఇతర శాంతియుత ప్రయోజనాల కోసం మాత్రమే అనుమతించబడతాయి. పర్యాటకులు, శాస్త్రవేత్తలు పెద్ద పెద్ద ఓడలతో పాటు కొన్ని సందర్భాలలో, కొన్ని ప్రాంతాలలో విమానాలలో ఇక్కడకు వెళ్లవచ్చు.

## జంతు సంపద

కొన్ని దీవుల్లో నల్లని, నీలి వేల్స్ తిమింగలాలు కనిపిస్తాయి. అటువంటి ప్రదేశాలలో పర్యాటకులు భయపడతారని వేళ్లపై లెక్క వేయగలిగినంత మందిని మాత్రమే అనుమతిస్తారు. ముఖ్యంగా యాంకీ పోక్టర్ ప్రాంతంలో పర్యాటకులు పడవలపై ప్రయాణించి 60 అడుగుల పొడవు తిమింగలాలను చూడవచ్చు. ఇదో సాహస యాత్ర అనే చెప్పాలి. ఈ ఖండం ఉపరితలంపై జంతు సంపద ఎంత తక్కువగా ఉంటుందో, దాని తీర ప్రాంత సముద్ర జలాల్లో అంత ఎక్కువగా ఉంటుంది. సీల్ మృగాలు, తిమింగలాలు ఈ జలాల్లో అనేక రకాల జంతువుల్లో ప్రధానమైనవి. అంటార్కిటికా ప్రాంతంలో అతిపెద్ద రాక్షస బల్లుల శిలాజాలు ఉన్నట్లు వెల్లడైంది. ఈ శిలాజాలు కొన్ని లక్షల సంవత్సరాల నాటివని, అప్పట్లో ఈ ఖండం మీద వెచ్చని శీతోష్ణస్థితి ఉండేదనే విషయాలను శాస్త్రవేత్తలు కనుక్కున్నారు. అతి శీతల అంటార్కిటిక్ సముద్ర జలాల్లో జీవించే జంతుజాలానికి చర్మం దిగువన ఒక దళసరి కొవ్వు పొర ఉంటుంది. ఇక్కడ అనేక రకాల 'పెంగ్విన్' పక్షులు ఉన్నాయి. అంటార్కిటిక్ పక్షి సంతతికి ప్రతీకలుగా ఇవి నిలుస్తున్నాయి. గుడ్లు పొదగడానికి అనుకూలమైన వాతావరణం లేకపోవడంతో ఈ పక్షులు వాటికి అనుకూల ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో సమూహాలుగా నివసిస్తాయి. ఇలాంటి సమూహాలను 'రూకరీలు' అంటారు. ఈ ఖండంలోని సముద్ర జలాల్లో విరివిగా పెరిగే జంతువు 'క్రిల్'. ఇది 'రొయ్యను'ను పోలి ఉంటుంది.

## వృక్ష సంపద

ఇక్కడి వాతావరణం, శీతోష్ణ పరిస్థితుల కారణంగా మొక్కలు పెరగవు. దీనివల్ల అంటార్కిటికా 'ప్రపంచంలోనే వృక్షాలు లేని ఏకైక ఖండం'గా రికార్డులకెక్కింది. వృక్ష సంపద టండ్రాల్లోనే కనిపిస్తుంది. ఈ ప్రాంతంలో సుమారు 400 రకాల పాకుడు జాతి మొక్కలు దుర్భర పరిస్థితులను తట్టుకుని శిలలపై పెరుగుతున్నాయి.





## అగ్నిపర్వతాలు

అంటార్కిటికా ఖండం కింద ఉన్న చురుకైన అగ్నిపర్వతాలను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అంటార్కిటికాలోని ఎత్తయిన శిఖరం పేరు విన్సన్ మాసిఫ్. దీని ఎత్తు 4,892 మీటర్లు. ఇది ఎల్స్‌వర్త్ పర్వతాలలో ఉంది. అంటార్కిటికా ప్రధాన ఖండం పైన, పరిసర ద్వీపాలలోనూ అనేక ఇతర పర్వతాలు ఉన్నాయి. రాస్ ద్వీపంలోని 'మౌంట్ ఎరేబస్' ప్రపంచంలో దక్షిణాన ఉన్న అత్యంత చురుకైన అగ్నిపర్వతంగా ప్రసిద్ధి చెందింది. మరొక ప్రసిద్ధ అగ్నిపర్వతాన్ని డిసెప్షన్ ద్వీపంలో కనుగొన్నారు. ఇది 1970లో పెద్ద విస్ఫోటనం చెందింది. చిన్న విస్ఫోటనాలు తరచూ జరుగుతూనే ఉంటాయి. ఇటీవలి సంవత్సరాలలో లావా ప్రవాహాన్ని గమనించారు. నిద్రాణంగా ఉన్న కొన్ని అగ్నిపర్వతాలు సైతం చురుకుగా మారిన సందర్భాలు లేకపోలేదు. అంటార్కిటిక్ ద్వీపకల్పంలో నీటి అడుగున ఉన్న చురుగ్గా ఉండే అవకాశం ఉన్న అగ్నిపర్వతాన్ని అమెరికన్, కెనడియన్ పరిశోధకులు 2004లో కనుగొన్నారు.

## సరస్సులు

అంటార్కిటికాలో అనేక నదులు, సరస్సులు ఉన్నాయి. ఇక్కడి అత్యంత పొడవైన నది ఓనిక్స్. అంటార్కిటికాలో 70కి పైగా సరస్సులు ఉన్నాయి. ఇవి ఖండాంతర మంచు పలక పాదం వద్ద ఉన్నాయి. అతిపెద్ద సరస్సు పేరు వోస్తోక్. 1996లో రష్యా వారి వోస్తోక్ స్టేషన్ కింద కనుగొన్న వోస్తోక్ సరస్సు ప్రపంచంలోని హిమనదీయ సరస్సులలోకెల్లా అతి పెద్దది. ఈ సరస్సు 5 నుండి 10 లక్షల సంవత్సరాలుగా మంచు పలకలతో కప్పబడి ఉందని భావిస్తున్నారు. కానీ ఇటీవలి సర్వే ప్రకారం తరచూ ఒక సరస్సు నుండి మరొక సరస్సులోకి పెద్ద ఎత్తున నీరు ప్రవహిస్తుందని కనుగొన్నారు. అంటార్కిటికా ఖండానికి దక్షిణ పసిఫిక్, అట్లాంటిక్, హిందూ మహాసముద్రాలు చుట్టుముట్టి ఉన్నాయని కూడా చెప్పవచ్చు. ప్రపంచ మహా సముద్రపు దక్షిణ జలాలు దీన్ని చుట్టుముట్టి ఉన్నాయని కూడా చెప్పవచ్చు.

అంటార్కిటికా ఖండంలోని పలుచని మంచుపొరలు సముద్ర జలాల్లోకి విస్తరిస్తాయి. మంచుతీర అంచులు సుమారు 200 మీటర్ల మందాన్ని కలిగి ఉంటాయి. సమతలంగా ఉండే ఈ అంచుల్లోని విశాల భాగాలు తీరం నుంచి దూరంగా కొట్టుకుపోతాయి.



వీటిని మంచు కొండలు అంటారు. అంటార్కిటికా ఖండంలో సుమారు 98 శాతం ప్రాంతం దళసరి మంచు పొరతో కప్పి ఉంటుంది. ఈ ఖండం ప్రపంచంలోని 90 శాతం మంచును, 75 శాతం మంచినీటిని కలిగి ఉంది. అంటార్కిటికా ఖండంలో మంచు కరిగితే ప్రపంచవ్యాప్తంగా సముద్ర మట్టాలు 55 మీటర్ల ఎత్తు పెరిగే అవకాశం ఉంది. ఇదే జరిగితే సముద్ర తీర ప్రాంతాల్లోని నగరాలు, పట్టణాలు నీట మునుగుతాయి. ఈ ఖండంలో మంచుపొరల ఎత్తు గరిష్ఠంగా 4,500 మీటర్లు. కనిష్ఠంగా 3,000 మీటర్లు ఉంటుంది. ప్రపంచంలో అతిపెద్ద హిమానీ



నదాలైన 'లాంబార్ట్', 'బియర్డ్ మోర్' ఈ ఖండం లోనే ఉన్నాయి. తూర్పు అంటార్కిటికా ప్రాంతం ట్రాన్సాంటార్కిటిక్ పర్వతాలకు హిందూ మహాసముద్రం వైపున ఉంది. కోట్స్ ల్యాండ్, క్వీన్ మౌడ్ ల్యాండ్, ఎండర్‌బై ల్యాండ్, మాక్ రాబర్ట్సన్ ల్యాండ్, విల్కెస్ ల్యాండ్, విక్టోరియా ల్యాండ్‌లు ఈ ప్రాంతంలో ఉన్నాయి. తూర్పు అంటార్కిటికా ఎక్కువగా ఐస్ షీట్‌చేత కప్పబడి ఉంటుంది. అంటార్కిటికాలో బ్లడ్ ఫాల్ ఉంది. ఇందులోని నీరు ఎర్ర రంగులో రక్తాన్ని తలపించేలా ఉంటుంది. చాలా కాలం వరకు శాస్త్రవేత్తలకు సైతం ఈ విషయం అంతుచిక్కలేదు. 2017లో జరిపిన పరిశోధనలో ఆ వాటర్ ఫాల్ అడుగున ఒక ఉప్పునీటి సరస్సు ఉందని, అందులో ఉన్న ఐరన్ నీళ్లలో కలిసి బయటకు వచ్చినప్పుడే అది గాలిలోని ఆక్సిజన్‌తో మిళితం కావడంతో జరిగిన చర్యల వల్ల ఆ నీరు రక్తంలా ఎర్ర రంగులో ఉందని కనుగొన్నారు.

ఈ ప్రయాణంలో అనేకమంది పర్యాటకులు అనారోగ్యంపాలవుతుంటారు. ఖండం అంచు వద్ద, ధ్రువ పీఠభూమి నుండి బలమైన 'కెటబాలిక్' గాలులు తరచుగా తుఫాను శక్తితో వీస్తుంటాయి. లోపలి భాగంలో గాలివేగం సాధారణంగా మితంగా ఉంటుంది. అంటార్కిటికాలో మార్చి 22 నుండి సెప్టెంబరు 23 వరకు అక్కడ చలికాలం. ఈ ఆరు నెలల పాటు అక్కడ సూర్యుడు కనిపించడు. సెప్టెంబరు 24 నుండి మార్చి 21 వరకు వేసవి కాలం. ఈ ఆరు నెలలు సూర్యుడు అస్తమించడు. ఈ కారణాల వల్ల ఇక్కడ పగలు ఆరు నెలలు ఉంటే, రాత్రి ఆరు నెలలు ఉంటుంది.

అంటార్కిటికాలో రాయిలా గడ్డ కట్టుకున్న మంచు పర్వతాలు ఎవరో శిల్పి చెక్కినట్లు అద్భుతమైన శిలాతోరణాలుగా ఏర్పడి కనువిందు చేస్తాయి. ఇటువంటి మంచు శిలా తోరణాలు అనేకచోట కనిపించి సాహస యాత్రికులను నయనానందం చేస్తాయి.



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



కుటుంబ సమస్యలు పరిష్కారమవుతాయి. వృత్తి ఉద్యోగాల్లో వున్నవారికి సామాన్యంగా ఉంటుంది. ఉద్యోగులకు అభద్రతా భావం ఏర్పడుతుంది, ఓర్పుతో వ్యవహరించడం చెప్పదగిన సూచన. సామాజిక సంఘర్షణకు గురవుతారు. విద్యార్థులకు అధిక శ్రమ. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం మంచిది. శుభ వార్తలు వింటారు.

## వృషభం



వృథా సంచారం చేస్తారు. అదనపు ఆదాయానికై అన్వేషిస్తారు. ఆరోగ్య సమస్యలుంటాయి. ఉద్యోగులకు అధికారుల వత్తిడి ఉంటుంది. గృహ సౌఖ్యం. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. భాగస్వామ్య వ్యాపారులు విడిపోయే సూచనలున్నాయి. వారాంతంలో రుణాలు చేస్తారు. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం అన్ని విధాలా మంచిది.

## మిథునం



ఆలోచనల్లో స్థిరత్వం లోపిస్తుంది. ఆరోగ్య సమస్యలుంటాయి. రుణాలు చేయాల్సి వస్తుంది. విద్యార్థులకు అధిక శ్రమ. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. భాగస్వామ్య వ్యాపారులకు యథాతథంగా ఉంటుంది. వాహన యోగం. స్వల్ప ధన నష్ట సూచనలున్నాయి ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. మానసిక ఆందోళనకు లోనవుతారు.

## కర్కాటకం



క్రయ-విక్రయాలు లాభదాయకంగా ఉంటాయి. ఉద్యోగులకు స్థాన చలన సూచనలున్నాయి. రుణాలు తీరుస్తారు. ప్రతికూలతలు ఎదురైనా ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. కంటి సమస్యలు వేధిస్తాయి. దేశాంతర ప్రయాణం చేస్తారు. మీ శక్తి సామర్థ్యాలకు గుర్తింపు లభిస్తుంది. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. కుటుంబ సమస్యలు తీరుతాయి.

## సింహం



విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ సమాచారం అందుకుంటారు. ఆరోగ్యం కుదుట పడుతుంది. రుణాలు చేయాల్సి వస్తుంది. బంధు, మిత్రులను కలుసుకుంటారు. వృత్తి వ్యాపారులకు ఆర్థికంగా బాగుంటుంది. వృథా ఖర్చులుంటాయి. నిరుద్యోగులకు ఎదురు చూస్తున్న ఉద్యోగం లభిస్తుంది.

## కన్య



విందు-వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్య సమస్యలు ఉంటాయి. ఖర్చులను నియంత్రించడంలో విఫలమవుతారు. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. మనోధైర్యం ఏర్పడుతుంది. సాహస యాత్రలు చేస్తారు. ఉద్యోగులు సహనంతో వ్యవహరించడం మంచిది. ప్రతికూలతలు వున్నా ప్రారంభించిన పనులు పూర్తి చేస్తారు. కుటుంబ సమస్యలు తీరుతాయి.

## తుల



విలాసవంతమైన జీవితం పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. ఉత్సాహంగా గడుస్తుంది. ఉద్యోగాభివృద్ధి సంతృప్తికరంగా ఉంటుంది. వాహన యోగం. దంపతుల మధ్య అన్యోన్యత ఏర్పడుతుంది. సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు ఫలిస్తాయి. శుభ కార్యాలకు హాజరవుతారు. పోటీ పరీక్షల్లో విద్యార్థులు విజయం సాధిస్తారు. సాహిత్య సభలు, సమావేశాలకు హాజరవుతారు. ఉద్యోగులకు ఉన్నతాధికారం లభిస్తుంది.

## వృశ్చికం



కుటుంబ సమస్యలుటాయి. వృత్తి రంగాల్లో వున్నవారికి రుణాలు లభిస్తాయి. భాగస్వామ్య వ్యాపారుల సమస్యలు పరిష్కారమవుతాయి. ఉద్యోగులకు పై అధికారుల వత్తిడి ఉంటుంది. రుణాలు తీర్చడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. సామాజిక న్యాయం కోసం కృషి చేస్తారు. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. ఆహార, ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించండి. క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి.

## ధనుస్సు



వృత్తి వ్యాపారస్తులకు ఆశించిన ఫలితాలుంటాయి. విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. ఉద్యోగులకు స్థాన చలనం/పదోన్నతి లభిస్తుంది. వృథా ఖర్చులు ఉంటాయి. ప్రతికూలతలున్నా ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. కుటుంబంలో మనస్పర్థలు వచ్చే సూచనలున్నాయి, సంయమనంతో వ్యవహరించండి. సామాన్య ధన లాభం. అనుకున్నది సాధిస్తారు.

## మకరం



విందు-వినోదాల్లో పాల్గొంటారు. అకారణంగా మానసిక ఆందోళనకు లోనవుతారు. వృథా ఖర్చులను నియంత్రించడంలో విఫలమవుతారు. వారాంతంలో రుణాలు చేస్తారు. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. వాహన యోగం. కోపాన్ని నియంత్రించడం అత్యవసరం. ప్రయాణం లాభిస్తుంది. శారీరక, మానసిక వత్తిడికి లోనవుతారు. గృహ సౌఖ్యం. ఊహించిన వార్తలు వింటారు.బాల్య మిత్రులను కలుసుకుంటారు.

## కుంభం



పాప కార్య చింతన మంచిది కాదని తెలుసుకుంటారు. జాయింటు వ్యవహారాలు పరిష్కారమవుతాయి. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. ప్రత్యర్థుల వల్ల స్వల్ప ధన నష్టం. వారాంతంలో మానసిక ప్రశాంతత ఏర్పడుతుంది. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. వ్యాపారులకు సామాన్యంగా ఉంటుంది. కళాకారులకు, క్రీడాకారులకు సన్మాన యోగం.

## మీనం



సామాన్య ధన లాభం. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే విషయం సంకట పరిస్థితి ఏర్పడుతుంది. ఉద్యోగులకు ఉన్నతాధికారుల వత్తిడి ఉంటుంది. అకారణంగా మానసిక ఆందోళనకు లోనవుతారు. బంధు, మిత్రులను కలుసుకుంటారు. వృత్తి ఉద్యోగాల్లో ప్రతికూలతలుంటాయి, సహనంతో వ్యవహరించండి. వ్యాపారులకు యథాతథంగా ఉంటుంది. శుభ కార్యాల్లో పాల్గొంటారు. ఆరోగ్య సమస్యలు తీరుతాయి.

# సంతోషం ఉండే చోటు

**అది దట్టమైన అడవి. లెక్కపెట్టలేనన్ని రకరకాల చెట్లు. ఆ అడవిలో ఓ సాధువు ఓ చిన్నపాటి పాక ఏర్పాటు చేసుకుని ఉండేవారు. ఆ పాకను ఆనుకుని ఓ పెద్ద చెట్టు. అయితే ఆయన ఆ పాకను ఎప్పుడూ ఉపయోగించుకునేవారు కాదు.**

తనను చూడటానికి ఎవరైనా వస్తే వారిని ఆ పాకలో ఉండనిచ్చేవాడు. తాను మాత్రం పాకను ఆనుకుని ఉండే ఆ చెట్టు నీడలోనే ఆయన ఎక్కువసేపు గడుపుతుండేవారు. ఆయన దగ్గర మూడు రాళ్ల ఉండేవి. అవి ఇటుకల్లాంటివి.

ఇంతకూ ఆ రాళ్లు ఎందుకంటే ఆవే ఆయన పక్క(పడుకునేందుకు).

నిద్రపోయేటప్పుడు ఓ రాయి తలకింద పెట్టుకునేవారు. మరొకరాయి నడుము కింద, ఇంకో రాయి కాళ్ల కింద పెట్టుకునేవారు. వాటి మీద ఆయన పడుకునేవారు. దేహాన్ని ఓ రేకుతో కప్పుకునేవారు.

ఒకవేళ వర్షం పడితే..

ఆయన దేహం మూడు రాళ్ల మీద ఉండటం వల్ల వర్షంనీరు వాటి కింద నుంచి పారేది. ఆయన దేహం తడిసేది కాదు. పైనెలాగూ ఓ రేకునే దుప్పటిలా కప్పుకోవడంతో ఆయన తడుస్తారనే ప్రశ్నే లేదు.

ఆయన నిద్రకూ భంగం ఏర్పడేది కాదు. హాయిగా ఆదమరచి పడుకుండిపోయేవారు. పగటిపూట ఆ మూడు ఇటుకరాళ్లను ముక్కోణాకారంలో పేర్చి దాని మీద కూర్చునేవారు. కనుక పురుగులూ, అవీ ఇవీ ఆయనను కుడతాయనే సమస్యే లేదు. ఆయనకు మరే ఆలోచనా లేకపోవడంతో మానసిక ప్రశాంతతకు ఏమాత్రం లోటు ఉండేది కాదు.

తనను చూడటానికి ఎవరైనా వచ్చి ఏదైనా ఇస్తే తినేవారు. అంతేతప్ప ఆయనంతట ఆయన ఎటూ వెళ్లేవారు కాదు ఆహారం కోసం. నడకనేది కేవలం శారీరక వ్యాయామం కోసం తప్ప ఆహారం కోసం కాదు.

ఓరోజు ఆ దేశపు రాజు అడవికి వేటాడేందుకు వచ్చాడు. అయితే ఆ సాధువు ఇటుకరాళ్లపై పడుకున్న తీరుని చూసి రాజు బాధపడ్డాడు, జాలి పడ్డాడు.

"అయ్యో పాపం.. ఈయన ఇలా రాళ్లమీద పడుకోవడమేమిటని" అనుకున్నాడు ఆరు.

ఆ సాధువును తన కోటకు తీసుకువెళ్లి ఆయనకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తే హాయిగా ఉంటారు కదా! అనుకున్నాడు రాజు.

అనుకున్నదే తడవుగా ఆయన సాధువును ఎలాగైనా సరే కోటకు తీసుకుపోవాలనుకున్నారు.

అయితే అలా అనుకుంటూ రాజు కోటకు చేరుకున్నాడు.

వెంటనే ఇద్దరు భటులను ఓ పల్లకీతో అడవికి పంపాడు రాజు. సాధువును వెంటనే కోటకు తీసుకురావలసిందిగా భటులను ఆదేశించాడు.



ఇద్దరు భటులు అడవికి వెళ్లి రాజు గారి మాట చెప్పారు.

అయితే సాధువు "తనకెందుకు కోట, నీడ?" అని ప్రశ్నించారు.

కానీ భటులు ఆయనను బలవంతంగా ఒప్పించారు. రాజుగారి మాటగా ఆ ఇద్దరూ కలిసి సాధువును తమతో పల్లకీలో రాజుగారి కోటకు తీసుకుపోయారు.

అయితే పల్లకీ ఎక్కేటప్పుడు ఆయన మూడు ఇటుక రాళ్లను, తన దుప్పటిలాగా కప్పుకునే ఓ రేకునీ తనతో పాటు కోటకు తెచ్చుకున్నాడు సాధువు. ఆ రాళ్లూ, రేకు ఎందుకని? భటులు ప్రశ్నించారు.

ఆయన "అవి తనకెంతో ముఖ్యమని" అన్నారు.

కోటలోకి పల్లకీ వస్తుండటం చూసి రాజు ఎదురెళ్లి సాధువుకు స్వాగతం పలికారు.

సాధువుకోసం ఏర్పాటు చేసి గదిని చూపించాడు రాజు. సాధువు పడుకోవడం కోసం బంగారు మంచం ఉంచాడు. దాని మీద పట్టుపరుపు వేశాడు.

దాని మీద సేద తీరమని చెప్పి రాజు ఇవతలకు వచ్చేశాడు.

మరుసటి రోజు రాజు సాధువు ఉంటున్న గది దగ్గరకు వచ్చి చూడగా ఆయన ఎప్పట్లాగానే మూడు ఇటుకరాళ్లపై పడుకుని ఉండటం చూసి విస్తుపోయాడు రాజు

దేహం పైన దుప్పటిలాగా రేకు కప్పుకున్నారు సాధువు.

"ఏమిటి స్వామీ ఈ పడుకోవడం?" అని అడిగాడు రాజు.

అప్పుడు సాధువు "నాకు అవసరాలు లేవు, లోటూ లేదు. నేను ఎక్కడైనా ఒకేలా ఉంటాను. అదే ఆనందం నాకు" అని చెప్పారు.

సంతోషమనేది బంగారు మంచంలోనో లేక పట్టుపరుపులలోనూ ఉండదు. అది మనసుకి సంబంధించిన విషయం" అన్నారు సాధువు.

నిజమైన సంతోషానికి మార్గం మానసిక పరిపక్వత.

అది అలా ఉంచితే ఈనాటి ఓ సాధువును వెతుక్కుంటూ ఓ శిష్యుడు వెళ్లాడు.

సాధువు అతనిని తీక్షణంగా చూశారు.

అనంతరం "నువ్వు చాలా మంది దగ్గర అప్పు చేశావు. వాటినన్నింటినీ తీరుస్తేనే నీకు మానసిక ప్రశాంతత ఉంటుందని" అన్నారు.

శిష్యుడిగా ఉండిపోదామనుకున్న వ్యక్తికి ఆశ్చర్యం. ఈ విషయం సాధువు ఎలా చెప్పాడని?

"నేను అప్పు చేసానని ఎలా అంత కచ్చితంగా చెప్పారని?" అడిగాడు.

అప్పుడు ఆ సాధువు "నువ్వు అడిగినప్పుడల్లా అప్పులిచ్చి అన్నీ వదులుకుని అడవిబాట పట్టిన వారిలో నేనూ ఒకడిని" అని అన్నాడు.

"కానీ ఆశ్చర్యమేమిటంటే మానసిక ప్రశాంతత కోసం నా దగ్గరకు వచ్చి నన్నే అందుకు ఓ దారి అడుగుతున్నావుగా" అని,

"నీకు అప్పిచ్చి ఇలా అయిపోయిన నన్ను నువ్వు గుర్తించకపోవడం విడ్డూరంగా ఉందన్నాడు" సాధువు.

**- యామిజాల జగదీశ్**

ఆలయదర్శనం



# వైకుంఠనాథుడు రథంపై వచ్చిన క్షేత్రం

**భగవాన్ శ్రీ మహావిష్ణువు వైకుంఠం నుంచి తన రథంతో భూమిపై దిగి వెలసిన మహా పుణ్యక్షేత్రం కుంభకోణం. తమిళ నాడులోని ఆలయాల నగరమైన కుంభకోణంలో శివ, కేశవులకు అనేక ఆలయాలు ఉన్నాయి. శేషశయనుడు స్వయంగా వెలసిన క్షేత్రం ఇదేనని ఆళ్వారుల గ్రంథాల వల్ల తెలుస్తోంది. తిరుపతి, శ్రీరంగం తరువాత అంతటి పుణ్యక్షేత్రమిది.**

సారంగపాణిగా వెలసిన భక్తనందనుడు శయనిస్తూ వేలాది భక్తులను ఆశీర్వదిస్తుంటారు. అనంతునికి అత్యంత భక్తులైన 12 మంది ఆళ్వారులు నాలాయిర ప్రబంధంలో సారంగపాణిపై అనేక దివ్య గీతాలను రచించారు.

## స్థల పురాణం

భృగుమహర్షి వైకుంఠానికి వచ్చిన సమయంలో తనను గమనించలేదన్న కోపంతో ఏకంగా వైకుంఠనాథుని ఛాతిపై కాలితో కొడతాడు. అయితే భక్త దయా ళువు అయిన సుదర్శన ధారి ఏమాత్రం ఆగ్రహం ప్రదర్శించ కుండా అతిథి మర్యాదలు చేస్తాడు. దీంతో ఆగ్రహించిన అమ్మవారు భూలోకానికి వెళ్లిపోతుంది. ఆమెను అన్వేషిస్తూ భక్తవల్లభుడు భూలోకానికి వెళ్లిపోతాడు. అక్కడే తిరుమల కొండల్లో స్వయంభువుగా అవతరిస్తాడు. కొంత కాలం అనంతరం తన తప్పు మన్నించమని మహర్షి అమ్మవారిని వేడుకుంటాడు. తన కుమార్తెగా జన్మించాలని కోరుకుంటాడు. దీంతో అమ్మవారు భృగువును తపస్సు చేయాలని ఆదేశిస్తుంది. అమ్మవారి ఆదేశం ప్రకారం మహర్షి కుంభకోణంలో తపస్సు చేస్తాడు. స్థానికంగా ఉన్న హేమ పుష్కరిణిలో అమ్మవారు చిన్న శిశువుగా ఉండటం చూసి తీసుకెళ్లి పెంచుకుంటాడు. అమ్మవారికి కోమలవల్లి అని పేరు పెడతాడు. అనంతర కాలంలో అమ్మవారి కోసం వైకుంఠం నుంచి రథంలో స్వామివారు అక్కడకు చేరుకుంటారు. తరువాత వారి వివాహం అంగరంగ వైభవంగా జరుగుతుంది. భూలోకానికి వచ్చే క్రమంలో స్వామి కొన్నాళ్లు భూగర్భంలో ఉంటారు.



వైకుంఠం నుంచి వచ్చే సమయంలో చేతిలో సారంగం అనే విల్లును ధరించి ఉండటంతో సారంగపాణిగా పేరు వచ్చింది.


## శ్రీలక్ష్మీదేవి అమ్మవారు ఆవిర్భవించిన క్షేత్రం

శ్రీ మహాలక్ష్మీదేవి అమ్మవారు స్వయంగా బాలికగా అవతారం దాల్చిన క్షేత్రం కావడంతో కోమలవల్లి-శ్రీలక్ష్మి క్షేత్రంగా పేరు వచ్చింది. వివాహం తరువాత శ్రీమహావిష్ణువు ఇక్కడ అత్తింట్లో నివాసం ఉంటారు. అందుకే తమిళంలో స్వామిని వీట్టోడు మాప్పిళ్లై అంటారు. అంటే ఇంట్లో ఉండే అల్లుడు అని అర్థం. ఈ ఆలయంలో తొలిపూజలు అమ్మవారికి నిర్వహిస్తారు.

## అద్భుత కట్టడం

రథంపై వచ్చారు కనుక ఆలయాన్ని రథం కారంలో నిర్మించారు. చోళుల కాలంలో ఆలయాన్ని నిర్మించారు. ప్రధాన గర్భాలయంలో స్వామి అమ్మవారు కోమలవల్లితో కలిసి భక్తులకు దర్శనమిస్తారు. గాలిగోపురం పదకొండు అంతస్థులతో ఉంటుంది. పన్నెండు ఏళ్లకు ఒకసారి నిర్వహించే 'మహామహం' ఉత్సవం జరిపే ఐదు ఆలయాల్లో సారంగపాణి ఆలయం ఒకటి. ఆలయా నికి ముందు వున్న పొత్రామరై పుష్కరిణి ఇందుకు వేదికగా నిలుస్తుంది. భరతనాట్యంలోని 108 భంగిమలను ఆలయ గోడలపై చిత్రించారు. పంచరంగ క్షేత్రాల్లో ఇది ఒకటి. ఇవన్నీ కావేరి తీరంలో ఉంటాయి. శ్రీరంగపట్నం, శ్రీరంగం, అప్పలరంగం, పరిమళ రంగనాథుని ఆలయాల తరువాత సారంగపాణి ఆలయం ఉంది. ఇక్కడ ఉన్న రెండు రథాలు భారీగా ఉంటాయి. రథోత్సవం వైభవంగా జరుగుతుంది.

తమిళనాడులోని తంజావూర్ జిల్లాలో ఉన్న కుంభకోణానికి దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి రైలు, రోడ్డు సౌకర్యాలున్నాయి.


రాత్రి రాకుండా పగలు బాగా నిద్దరొస్తున్నది... అమెరికాలో పుట్టాల్సిన వాడిని పొరపాటున ఇక్కడ పుట్టాన డాక్టర్..?!
నిద్ర డాక్టర్
MD..
Zakir...
ఫ్రెష్ గౌనునా....! 72 స్నానాలకు మాత్రమే వెళ్లి వచ్చింది..!!
గౌనుల షాపు
Zakir...
నిజ్జం చెప్పండి ... దురదేసినప్పుడు గోక్కుంటే పిచ్చ హాయిగా ఉంటుంది కదూ...!!
..డాక్టర్..
Zakir...

ఈ వారం కా'ర్టూన్స్'



అన్ని ఇళ్లే కదా ఉన్నాయి.. ఇందులో పెద్ద వింతేముంది అనుకుంటున్నారా? ఆ ఊరి ప్రత్యేకత అదే మరి. జర్మనీలోని ఫ్రూడెన్‌బర్గ్ అనే ఊళ్లోని ఫొటోలివి. అక్కడ ఇళ్లన్నీ ఒకే విధంగా ఉంటాయి. ఆ ఇళ్ల ద్వారానే ఆ ఊరు బాగా ప్రాచుర్యం పొందింది. వీటితో పాటు మరెన్నో పర్యాటక ప్రాంతాలున్నాయి.







